http://www.agnidharanews.com

# అగ్నిధార

సోమవారం 24 మార్చి 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## సహాయక చర్యలపై

# రేవంత్ ఆరా..



- సహాయక చర్యలు ఆలస్యం కావడానికి గల కారణాలు ముఖ్యమంత్రి తెలుసుకున్నారు.
- సహాయక చర్యల కోసం రూ.5కోట్లు విడుదల
- దేశంలోని అత్యుత్తమ ఏజెన్సీలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నా పురోగతి కనిపించట్లేదు
- ఈ సొరంగం ప్రమాదం దేశంలోనే అరుదైనదిగా నిపుణులు చెబుతున్నారు.
- సహాయక చర్యలు ముమ్మరం చేసే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



నాగర్ కర్నూల్

నాగర్‌కర్నూల్‌లోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలపై తాజాగా అక్కడ జరుగుతున్న సహాయకచర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. సహాయక చర్యలు ఆలస్యం కావడానికి గల కారణాలు ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ఇదే సమయంలో సహాయక చర్యల కోసం రూ.5కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. సహాయక చర్యలు ముమ్మరం చేసే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. ఇదిలా ఉండగా.. నెల రోజుల క్రితం ఫిబ్రవరి 22వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట శివారులో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం పైకప్పు కూలిన దుర్ఘటన చోటు చేసుకుంది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ప్రమాదం జరగ్గా.. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఒక్కొక్కరిగా మొత్తం 42 మందిని సురక్షితంగా మధ్యాహ్నంలోపు బయటకు తీసుకొచ్చారు. సొరంగంలో చిక్కుకున్న 8 మంది సిబ్బంది కోసం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మానవ అవశేషాలను గుర్తించడంలో దిట్ట అయిన కేరళ ప్రత్యేక జాగిలాలు రంగంలోకి దిగినా.. ప్రయోజనం - మిగతా3లో

# బీజేపీవైపు దక్షిణాది



- అందుకే డీలిమిటేషన్ డ్రామా
- డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు
- దక్షిణాదిలో బీజేపీ బలపడకూడదని కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే కుట్ర చేస్తున్నాయి
- స్టాలిన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది
- ప్రభుత్వ వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ డీలిమిటేషన్ మీటింగ్ పెట్టారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ జతకట్టిపోవడం వాళ్ల చీకటి ఒప్పందానికి నిదర్శనం

హైదరాబాద్

దేశంలో డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. దక్షిణాదిలో బీజేపీ బలపడకూడదని కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. స్టాలిన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. ప్రభుత్వ వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ డీలిమిటేషన్ మీటింగ్ పెట్టారని అన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ జతకట్టిపోవడం వాళ్ల చీకటి ఒప్పందానికి నిదర్శనమని ఘాటు విమర్శలు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ..'డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నిజస్వరూపం మరోసారి బయటపడింది. దక్షిణాదికి అన్యాయం చేసి బీజేపీ బలపడాలని అనుకోవడం లేదు. దక్షిణాదిలో బీజేపీ బలపడకూడదని కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే కుట్ర చేస్తున్నాయి. చెన్నై సమావేశానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ జతకట్టిపోవడం వాళ్ల చీకటి ఒప్పందానికి నిదర్శనం. దేశంలో లేని సమస్యను సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు. లేని డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం - మిగతా3లో




## నోట్ల కట్టల ఆరోపణలు నిరాధారం

- జస్టిస్ యశ్వంత్ వర్మ
- తనకు, తన కుటుంబానికి ఆ నగదుతో ఎలాంటి సంబంధం లేదు
- తమపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అర్థరహితం
- "స్టోర్ రూంలో నేను కానీ, నా కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి నగదు ఉంచలేదు
- మాకు చెందిన నగదు దొరికిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు"

## ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్..

## అంతటా అంధకారం..



ఈ ఏడాది 19వ ఎర్త్ అవర్ ప్రపంచ జల దినోత్సవంతో పాటు జరిగింది. ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలను ఆపివేయడం ద్వారా ఢిల్లీలో దాదాపు 269 మెగావాట్ల విద్యుత్తును ఆదా చేశారు

# దక్షిణ తెలంగాణను కేసీఆర్ ముంచాడు

- కేటీఆర్‌కు జిల్లాకు వచ్చే హక్కే లేదు
- 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ స్టార్టింగ్..
- ఎండింగ్ పాయింట్ ఎక్కడ ఉందో తెలుసా?
- స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు జిల్లా పరిషత్‌లను గెలుస్తాం
- ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని వైఎస్సార్ చొరవతో ప్రారంభించుకున్నాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



సూర్యాపేట జిల్లా:

కేటీఆర్ ఓ పిలగాడంటూ వ్యాఖ్యా నించారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. పదేళ్ళుదక్షిణ తెలంగాణను కేసీఆర్ ముంచాడని.. కేటీఆర్‌కు జిల్లాకు వచ్చే హక్కే లేదంటూ వ్యాఖ్యానించారు. పాలకవీడు మండలం జానపహాడ్ లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి మీడియా సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ స్టార్టింగ్.. ఎండింగ్ పాయింట్ ఎక్కడ ఉందో జగదీష్ రెడ్డికి తెలుసా అంటూ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో - మిగతా3లో



# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం

- భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం
- అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకం
- అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి
- భారత ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోంది

# ‘సుశాంత్ కేసు క్లోజ్.. రియాకు ఇదే నా శాల్యూట్!



**ముంబై:** సుమారు ఐదేళ్ల క్రితం బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మృతి కేసు పెద్ద సంచలనం. సుశాంత్ ఆత్మహత్య చేసుకోవడానికి గర్ల్ ఫ్రెండ్ రియా చక్రవర్తినే కారణమంటూ పెద్ద దుమారమే చెలరేగింది. 2020, జూన్ 14వ తేదీన సుశాంత్ బాంద్రాలోని తన నివాసంలో విగతజీవిలా పడివున్నాడు. మెడకు ఉరి వేసుకుని ఉన్న సుశాంత్ మరణంపై అనేక అనుమానాలు తలెత్తాయి. దీనిపై దాదాపు ఐదేళ్ల పాటు విచారణ జరిపిన సీబీఐ.. ఎట్టకేలకు తుది రిపోర్ట్ ఇచ్చింది. సుశాంత్ మరణం వెనుక ఎవరి ప్రేరేపితం లేదని స్పష్టం చేసింది. అంటే ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న సుశాంత్ గర్ల్‌ఫ్రెండ్ రియాకు భారీ ఊరట లభించినట్లయ్యింది. అయితే దీనిపై రియా లాయర్ సతీష్ మనీషిండే మాట్లాడుతూ..‘ ఈ కేసులో ప్రతీకోణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తుది నివేదికను ఇచ్చిన సీబీఐకి కృతజ్ఞతలు. అటు ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా రియాపై అనేక రకాలైన తప్పుడు కథనాలు వచ్చాయి. అది కోవిడ్ వచ్చిన సమయం కావడంతో ప్రతీ ఒక్కరూ టీవీలు, సోషల్ మీడియాను ఎక్కువ చూశారు. ఈ క్రమంలోనే రియాపై ఎన్నో తప్పుడు వార్తలు చుట్టుముట్టాయి. నిరాధారమైన ఆరోపణలతో ఆమెను, ఆమె కుటుంబాన్ని నానా యాగీ చేశారు. ఈ రకంగా చేయడం వల్ల అమాయకులు చాలా నష్టపోతారు. కానీ చివరకు రియా పాత్ర ఏమీ లేదని క్లియరెన్స్ వచ్చింది. ఇక్కడ రియాకు సెల్యూట్ చేస్తున్నా. ఎన్నో అవమానాలను భరించి ఎటువంటి నోరు విప్పకుండా మౌనం పాటించిన రియాకు, ఆమె కుటుంబానికి సెల్యూట్ చేస్తున్నా’ అని రియా లాయర్ సతీష్ మనీషిండే తెలిపారు.

**సీబీఐ రిపోర్ట్‌లో ఏం చెప్పింది..?**

సుశాంత్ మరణానికి సంబంధించి నమోదైన రెండు కేసుల్లో ఎవరి పాత్ర లేదని తెలిపింది. ఈ మేరకు ముంబై కోర్టులో సీబీఐ క్లోజర్ రిపోర్ట్‌ను దాఖలు చేసింది. బాలీవుడ్ నటుడు సుశాంత్ మరణం వెనుకు ఎవరి పాత్ర లేదని, ఎటువంటి కుట్రలు జరగలేదని తెలిపింది. సుశాంత్ మరణంలో నటి రియా, ఆమె కుటుంబ సభ్యుల పాత్ర లేదని పేర్కొంది.

# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై ఓవైపు చర్చ జరుగుతుండటం, ప్రతీకార వాణిజ్య సుంకాలకు అగ్రరాజ్యం అమెరికా గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందాలు వాస్తవమని, అయితే భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అనే విధానాన్ని తాము అనుసరించనున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకమని, అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ అన్నారు. ప్రధానంగా సున్నితమైన టెక్నాలజీ విషయంలో ఇలాంటి ఒప్పందాల వల్ల ఇరువైపులా ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. భారత ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోందని జైశంకర్ తెలిపారు. వీటిలో ఒకటి యూఎస్‌తో జరురుతోందని చెప్పారు. “అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు కీలకం. ఇప్పుడు వీటి ప్రాధాన్యత కూడా పెరిగింది. దీనిని భారత్ గుర్తించింది. ప్రస్తుతం, మనం మూడు వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతున్నాం. ఐరోపా సమాఖ్య, యూకే, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందంతో చర్చలు జరుపుతున్నాం. న్యూజిలాండ్‌తో కూడా ఈ వారమే చర్చలు ప్రారంభించాం. మరి కొందరితో కూడా చర్చలు జరపనున్నాం” అని జైశంకర్ తెలిపారు. భారతదేశం “ఇండియా ఫస్ట్” విధానాన్ని అనుసరించనుందని జైశంకర్ భరోసా ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఇండియా ఫస్ట్ పాలసీని అనుసరించనున్నట్టు చెప్పారు. గతంలో ఎక్కువగా ఆసియా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ)లు చేసుకునే వాళ్లమని, వాణిజ్యం పోటాపోటీగా ఉండేదని అన్నారు. అమెరికా ఫస్ట్ పాలసీలో భాగంగా డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతీకార సుంకాలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. భారత్‌తో మంచి సంబంధాలే ఉన్నాయని, అయితే భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు.

# ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్.. అంతటా అంధకారం..



**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని చారిత్రక ప్రదేశాలకు ఉన్నట్టుండి ఒక్కసారిగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని ఎప్పుడైనా చూశారా?. రాత్రివేళ ఎప్పుడూ కాంతులీనే ఈ ప్రాంతాల్లో అంధకారం అలముకుంటే ఎలా ఉంటుంది? ఇటువంటి దృశ్యం శనివారం కనిపించింది. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ఎర్త్ అవర్ సెలబ్రేషన్ 2025 కింద ఈ విధంగా చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. శనివారం సాయంత్రం ఇండియా గేట్, ఎర్రకోట, రాష్ట్రపతి భవన్, విక్టోరియా మెమోరియల్, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్.. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న పలు చారిత్రక ప్రదేశాలలో లైట్లు ఆపివేశారు. ఈ ఏడాది 19వ ఎర్త్ అవర్ ప్రపంచ జల దినోత్సవంతో పాటు జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీతకారుడు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా హోప్ అండ్ హార్మోనీ రాయబారి శంతను మొయిత్రా తన సంగీత ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు చారిత్రక ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలను ఆపివేయడం ద్వారా ఢిల్లీలో దాదాపు 269 మెగావాట్ల విద్యుత్తును ఆదా చేశారు. ఎర్త్ అవర్ అనేది విద్యుత్తును ఆదా చేసే ప్రచార కార్యక్రమం. ప్రజలు తమ దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ప్రపంచంపై పడే భారాన్ని తగ్గించవచ్చని ఎర్త్‌డే చెబుతుంది. నీటిని ఆదా చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం ద్వారా భూమిని కాపాడవచ్చని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ ప్రచారానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన ఎర్త్ అవర్ సందర్భంగా 206 మెగావాట్ల విద్యుత్ ఆదా అయిందని పలు నివేదికలు చెబుతున్నాయి.

# పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్స్..

న్యూఢిల్లీ: అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్ సభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సోమవారం నుంచి అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు లోకసభ సచివాలయం అనుమతి ఇచ్చింది. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో పార్లమెంటు ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కోసం గిరిజన కోఆపారేటివ్ సొసైటీ అధికారులు ఢిల్లీ చేరుకున్నారు. అలాగే రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకోనున్నారు.

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ..కాగా పార్లమెంట్ భవన్‌లో సోమవారం అరకు కాఫీ స్టాల్ ప్రారంభమవుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె ఫోన్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కోసం తాను ఢిల్లీ వెళ్తున్నట్టు చెప్పారు. అరకు కాఫీకి ఈ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 139 అంగన్‌వాడీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.20.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. పీఎం జన్‌మన్ కింద జిల్లాకు 11 కేంద్రాలు మంజూరయ్యాయని వెల్లడించారు. వాటికి సంబంధించి 11 పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న మరో 53 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్టు చెప్పారు. కొండ శిఖర గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నామన్నారు. డోలీలు మోతలు తప్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా గిరి బజార్ ద్వారా గిరిజనులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. ట్రైనర్ ఆసుపత్రిని కూడా ప్రారంభించామని చెప్పారు.

## ఆయన శారీరకంగా అలసిపోయారు
## మానసిక స్థిమితం కోల్పాయారు




**సమస్తిపూర్:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నితీష్ శారీరకంగా అలసిపోయారని, మానసిక పరిస్థితి సరిగా లేదని, దీంతో ఆయన పాలన విషయంలో రాజీపడుతున్నారని ఆరోపించారు. సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారంనాడిక్కడ మీడియాతో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ...’ ’నితీష్ కుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన మిత్రపక్షం నేత సుశీల్ కుమార్ మోదీ తొలిసారి మాట్లాడారు. ఆ తర్వాత పలువురు బీహార్ మంత్రులు కూడా వ్యాఖ్యానించారు. గత జనవరి వరకూ నేను ఎలాంటి కామెంట్లు చేయలేదు. కానీ బీపీఎస్‌సీ నిరసనల తర్వాత నితీష్ కుమార్ మానసిక స్థితి క్షీణించిందని తెలిసింది. ఆ కారణంగానే రాష్ట్రంలో ఏమి జరుగుతోందో కూడా తెలియని పరిస్థితిలో ఆయన ఉన్నారు. ఆయన శారీరకంగా అలసిపోయారు. మానసికంగా ఫిట్‌నెస్‌తో లేరు. ఇందుకు సాక్ష్యం కావాలంటే ఆయన కౌన్సిల్‌లో మంత్రుల పేర్లు అడిగి చూడండి. ముఖ్యమంత్రి పదవికి నితీష్ కుమార్ రాజీనామా చేయడం మంచిది” అని సూచించారు. ఇందులో బీజేపీకి కూడా సమాన బాధ్యత ఉందని, నితీష్ కుమార్ మానసిక స్థితి కోల్పోయిన విషయం ప్రధానికి కానీ, హోం మంత్రికి కానీ తెలిసినట్టు లేదని అన్నారు.

**తేజస్విదీ అదే మాట..**

కాగా, నితీష్ మానసిక, శారీరక దారుఢ్యాన్ని కోల్పోయారని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇటీవల కాలంలో పలుమార్లు విమర్శలు గుప్పించారు. నితీష్ రాజీనామాకు డిమాండ్ చేశారు. ఒక కార్యక్రమంలో జాతీయ గీతం ఆలపిస్తుండగా నితీష్ మాట్లాడుతున్న వీడియోను గత గురువారంనాడు ఆయన షేర్ చేశారు. యువకులు, విద్యార్థులు, మహిళలు, వయోవృద్ధులను ప్రతిరోజూ అవమానించే ముఖ్యమంత్రి కనీసం జాతీయ గీతాన్నైనా అమానించకుండా ఉంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

## జాతరలో అపశ్రుతి..
## కుప్పకూలిన 120 అడుగుల రథం



**బెంగళూరు:** కర్ణాటకలోని బెంగళూరు శివార్లలో ఊరేగింపు సందర్భంగా 120 అడుగుల రథం కూలిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకల్‌లోని హుస్కూర్‌లో శనివారం మద్దురమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా వంద అడుగులకుపైగా ఎత్తైన రెండు రథాలను ఆలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. కాగా, ఊరేగింపు సందర్భంగా రెండు రథాలను తాళ్ల సహాయంతో భక్తులు లాగారు. అయితే ఈదురు గాలుల వల్ల120 అడుగుల ఎత్తైన రథం అదుపుతప్పి ఒక పక్కకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి చెందగా.. పలువులు గాయపడ్డారు. వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతి చెందిన వ్యక్తిని తమిళనాడులోని హొసూర్‌కు చెందిన లోహిత్‌గా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఏడాది కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఇదే ఉత్సవంలో రథం కూలిపోవడంతో.. పార్క్ చేసిన అనేక వాహనాలు దెబ్బతిన్నాయి, అయితే, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

## నోట్ల కట్టల ఆరోపణలు నిరాధారం



**న్యూఢిల్లీ:** అగ్నిప్రమాదం సందర్భంగా తన ఇంట్లో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఆయన సుదీర్ఘ లేఖ రాశారు. తనకు, తన కుటుంబానికి ఆ నగదుతో ఎలాంటి సంబంధం లేదని, తమపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అర్థరహితమని తెలిపారు. “స్టోర్ రూంలో నేను కానీ, నా కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి నగదు ఉంచలేదు. మాకు చెందిన నగదు దొరికిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు” అని యశ్వంత్ వర్మ తెలిపారు. కాలిన నోట్ల కట్టలు కనిపించాయంటూ చెబుతున్న విజువల్స్ తనపై బురదజల్లి, తన ప్రతిష్టను భంగపరచేందుకు జరిగిన కుట్రగా కనిపిస్తోందన్నారు. వీడియోలోని కంటెంట్ చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు. ప్రమాద స్థలిలో కనిపించినట్టు చెబుతున్న కాలిన నోట్ల కట్టలను తాను ఎప్పుడూ చుడలేదని అన్నారు. తన ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకులు, యూపీఏ అప్లికేషన్లు, కార్డుల ద్వారానే జరిగాయన్నారు. కాలిన నోట్లుగా చెబుతున్న కరెన్సీని తాము ఎప్పుడూ చూడనే లేదని జస్టిస్ వర్మ వివరణ ఇచ్చారు. అగ్నిప్రమాదం జరిగిందని చెబుతున్న స్టోర్‌రూమ్‌లో పాడైపోయిన ఫర్నిచర్లు, బాటిల్లు, వాడిన కార్పెట్లు వంటివి మాత్రమే ఉంచేవాళ్లమని, మెయిన్ రెసిడెన్స్‌కు ఎలాంటి అనుసంధానం లేదని, కచ్చితంగా అది తన ఇంట్లో రూమ్ కాదని ఆయన తెలిపారు. మంటలను ఆర్పే సమయంలో తన కుటుంబ సభ్యులు, సిబ్బందిని భద్రతా కారణాలతో దూరంగా ఉండమని చెప్పారని, మంటలు చల్లార్చిన తర్వాత కూడా తమ సిబ్బంది, కుటుంబ సభ్యులకు అక్కడ ఎలాంటి కరెన్సీ కనిపించలేదని వర్మ తెలిపారు. స్టాఫ్ కార్వర్ట్స్ సమీపంలో కానీ, ఔట్ హౌస్ సమీపంలో కానీ బహిరంగంగా నగదు నిల్వ చేయాలనే ఆలోచన నమ్మశక్యం కాదని అన్నారు. కాలిన కరెన్సీ బస్తాలను తమకు చూపించడం కానీ, ఇవ్వడం కానీ జరగలేదన్నారు. కరెన్సీకి సంబంధించిన ఆధారాలు కూడా లేవన్నారు. ఒక న్యాయమూర్తి జీవితంలో వ్యక్తిత్వం, ప్రతిష్ట చాలా ముఖ్యమని, తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంపై విచారణ జరిపాలని సీజేఐ సంజీవ్ ఖన్నా నిర్ణయించారు. ఇందుకోసం మూడు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులతో త్రిసభ్య సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేసుల విచారణ పరంగా జస్టిస్ యశ్వంత్ వర్మకు ఎలాంటి బాధ్యతలు అప్పగించవద్దని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సీజేఐ ఆదేశించారు.

# కాంగ్రెస్ సర్కార్ అసమర్ధ పాలనతోనే రైతులకు కష్టాలు

**సిద్దిపేట:** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవి పల్లి గ్రామంలో నిన్న(శనివారం) రాత్రి కురిసిన వర్షాలు, వడగండ్ల కారణంగా దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. రైతు బంధు రూపంలో కేసీఆర్ రైతులకు నేరుగా సాయం చేశారు. వానా కాలం యాసంగి రైతుబంధు రూ. 15 వేలు వెంటనే విడుదల చేయాలి. పంటల బీమా ఉండే రైతులకు ఇంత నష్టం ఉండేది కాదు. రైతులకు మూడు పంటల బీమా రాలేదు. రుణమాఫీ చేయలేదు ఇచ్చామని.. అబద్ధాలు ఆడుతున్నారు" అని కాంగ్రెస్‌పై హరీష్‌రావు మండిపడ్డారు. "రేవంత్ రెడ్డి అన్ని అబద్ధాలు ఆడుతున్నారు. ఎండల వల్ల పంటలు ఎండటం లేదు. కాంగ్రెస్ అసమర్ధ పాలన వల్ల నీళు లేక పంటలు ఎండిపోతున్నాయి. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆర్థిక సాయం చేసి అందుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి" అని హరీష్‌రావు పేర్కొన్నారు.




## కేటీఆర్ కాన్వాయ్‌లో అపశ్రుతి

**కరీంనగర్, మార్చి 23:** కరీంనగర పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌లో ఆదివారం అపశృతి చోటు చేసుకుంది. మహిళా కానిస్టేబుల్ పద్మజను పార్టీ కార్యకర్త శ్రీకాంత్ బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళా కానిస్టేబుల్ పద్మజా కాలు విరిగింది. దీంతో పార్టీ శ్రేణులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరా తీశారు. మహిళా కానిస్టేబుల్ పద్మజకు వెంటనే వైద్య చికిత్స అందించాలని ఆసుపత్రి వైద్యులను మాజీ మంత్రి కేటీఆర్ కోరారు. రేవంత్ రెడ్డి 14 నెలల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనకబాటు చెందిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఉచిత పథకాల పేరుతో హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా హామీలకు రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ తిలోదకాలు ఇచ్చిందని విమర్శించారు. ఆ క్రమంలో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టేందుకు ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అందులోభాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని ఆయన నిర్ణయించారు. ఆ క్రమంలో ఇప్పటికే కేటీఆర్.. సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఇక మార్చి 23వ తేదీన కరీంనగర్‌లో కేటీఆర్ పర్యటిస్తున్నారు. మరోవైపు టీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 ఏళ్లు కావోస్తుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ వేదికగా రజితోత్సవ సభ ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ అగ్రనాయకత్వం నిర్ణయించింది. ఈ సభను మార్చి 27వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించాలని భావిస్తుంది. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లపై చర్చించడమే కాకుండా.. ఈ సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ కసరత్తు చేస్తుంది. అందులోభాగంగా ఆదివారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తోపాటు ఆ పార్టీలోని పలువురు కీలక నేతలు కరీంనగర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన కాన్వాయ్‌లో చిన్నపాటి ప్రమాదం చోటు చేసుకుంది. కేటీఆర్ రాక సందర్భంగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ పద్మజను బీఆర్ఎస్ కార్యకర్త వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆమె కాలు విరిగింది.

## నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో బర్డ్‌ఫ్లూ

**రెండు లక్షల కోళ్ల ఖననానికి చర్యలు.. 6కోట్ల మేర నష్టం**

**చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో పశు సంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పౌల్ట్రీఫ్రామ్‌లోని రెండు లక్షల కోళ్ల ఖననానికి చర్యలు చేపట్టారు. గుండ్రాంపల్లి గ్రామశివారుల్లో 15 ఏళ్లుగా వీఎస్‌కే పౌల్ట్రీఫ్రామ్ నిర్వహిస్తున్న వంగోటి బాలకృష్ణారెడ్డి.. ఈ నెల 17న సుమారు వెయ్యి కోళ్లు మృతి చెందడంతో పశు సంవర్ధకశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వీఎసకే పౌల్ట్రీఫ్రామ్ వైద్యులు, ప్రత్యేక బృందాలతో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ ఈ నెల 18న పౌల్ట్రీఫ్రామ్‌ను తనిఖీ చేశారు. షెడ్లు, కోళ్లను పరిశీలించారు. ఈ పౌల్ట్రీఫ్రామ్‌లో మరణించిన కోళ్ల కళేబరాల నమూనాలను పరీక్షించిన హైదరాబాద్, భోపాల్ ల్యాబ్‌లు బర్డ్‌ఫ్లూ వల్లే అవి మరణించాయని ఈ నెల 19న నివేదిక ఇచ్చాయి. దీంతో రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది ఈ నెల 20న వీఎసకే పౌల్ట్రీఫ్రామ్‌కు చేరుకున్నారు. పీపీఈ కిట్లు ధరించి ప్రత్యేక వాహనాల్లో కోళ్లఫామ్‌లోకి వెళ్లి శనివారం సాయంత్రం వరకూ 1.14 లక్షల కోళ్లకు మత్తుమందు ఇచ్చి చంపేశారు. ఎక్స్‌కవేటర్‌తో కోళ్ల ఫామ్ మధ్య గల స్థలంలో పది అడుగుల లోతు గుంతలు తవ్వించి కోళ్ల కళేబరాలు, గుడ్లు పూడ్చి పెట్టారు. మొత్తంగా యజమానికి రూ. 6 కోట్ల నష్టం వాటిల్లనున్నట్లు సమాచారం.

## తెలంగాణ విద్యా కమీషన్‌లో అర్బన్ నక్సల్స్



**కరీంనగర్ :** తెలంగాణ విద్యా కమీషన్‌లో అర్బన్ నక్సల్స్ ఉన్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ భూములమ్మి జీతాలు చెల్లించే పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ అధినేతకు బీదర్‌లో దొంగనొట్లు ముద్రించే ప్రెస్ ఉందని, దొంగనోట్ల వ్యాపారం చేసి ఎన్నికల్లో డబ్బులు పంచారని ఆరోపించారు. పదేండ్లు బీఆర్ఎస్ తెలంగాణ ప్రజలను మోసం చేసింది. ప్రభుత్వం భూములు అమ్మి జీతాలు ఇచ్చే పరిస్థితి తెచ్చింది. ఈ ప్రభుత్వంలో 15 నుండి 18 కమిషన్ పెంచారు. కమిషన్ ఇచ్చిన వారికే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని విమర్శించారు.

# బీజేపీవైపు దక్షిణాది

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నాయి. తమిళనాడులో కుటుంబ, అవినీతి పాలన నడుస్తోంది. డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీజేపీపై తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం. కుటుంబ, అవినీతి పార్టీలు మోదీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఎలాంటి వివక్ష లేకుండా అన్ని రాష్ట్రాలు అభివృద్ధి జరగాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారు. స్టాలిన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. తండ్రీకొడుకులు అక్కడ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. భాషల పేరు మీద దక్షిణాదికి అన్యాయం చేయాలని బీజేపీ అనుకోవడం లేదు. దక్షిణాది ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు డీలిమిటేషన్ మీటింగ్ పెట్టారు. కాంగ్రెస్ కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితమైంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణ, కర్ణాటకలో అధికారం బీజేపీదే. డీలిమిటేషన్ చేయాలంటే పార్లమెంట్‌లో చట్టం చేయాలి. ఇంకా జనాభా లెక్కల సేకరణే జరగలేదు' అని చెప్పుకొచ్చారు. డీలిమిటేషన్ గురించి గతంలో ఉన్న చట్టాలు కాంగ్రెస్ తీసుకొచ్చినవే. ఏదో జరిగిపోతుందని కేటీఆర్, రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. ఆరు గ్యారంటీలపైన రేవంత్ దృష్టి పెడితే బాగుంటుంది. నిన్న జరిగిన సమావేశంలో ఆయా



రాజకీయ పార్టీలు వారి స్వప్రయోజనం కోసం మాట్లాడుతున్నాయి. గతంలో ఇవే రాజకీయ పార్టీలు రాజ్యాంగం మారుస్తారని ప్రచారం చేశారు. ఏది జరిగినా ఏ ప్రాంతానికి అన్యాయం జరగదు. అవినీతి, కుటుంబ పార్టీలు చేస్తున్న వాటిని ప్రజలు తిప్పికొట్టాలి. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య సయోధ్యని కుదుర్చే పనిలో ఎంఐఎం ఉంది అని వ్యాఖ్యలు చేశారు.

## రెచ్చిపోయిన సైకో.. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఓ కుటుంబం..

**హైదరాబాద్:** పోచారం ఐటీ కారిడార్ సైకో దాడి ఘటన లో ఓ చిన్నారి మృతిచెందింది. శనివారం నాడు రోడ్డుపై వెళున్న పలువురిపై సైకో విచక్షణారహితంగా దాడి చేశాడు. కత్తితో ఇష్టం వచ్చినట్లు గాయపరిచాడు. ఇదే క్రమంలో చిన్నారిపైనా సైకో దాడి చేశాడు. కత్తితో శరీర భాగాలపై



పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో బాలికను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు తల్లిదండ్రులు. అయితే చికిత్సపొందుతూ చిన్నారి ఇవాళ(ఆదివారం) మృతిచెందింది. ఆమె మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వారు సమాజంలో తిరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కాగా, ఈ ఘటన స్థానికుల హృదయాలను తీవ్రంగా కలచివేసింది.

అసలేం జరిగిందంటే..

హైదరాబాద్ పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిన్న(శనివారం) ఓ సైకో వీరంగం సృష్టించాడు. సూర్య ఆస్పత్రి వద్దకు వచ్చిన సైకో కాసేపు అటూఇటూ కలియ తిరిగాడు. అనంతరం రాళ్లు, కర్రలతో అక్కడ పార్క్ చేసిన కార్లపై దాడి చేశాడు. అతని చేష్టలను చూసిన స్థానికులు, కార్ల యజమానులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే ప్యాంట్‌లో దాచుకున్న కత్తిని ఒక్కసారిగా బయటకు తీసిన సైకో.. అందరిపైనా దాడికి తెగబడ్డాడు. కనిపించిన ప్రతి ఒక్కరినీ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనలో పలువురు యువకులు, మహిళలు, చిన్నారులకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అంతా కలిసి ఎట్టకేలకు సైకోను బంధించారు. తాళ్లతో కట్టేసి స్పృహతప్పి పడిపోయేంతగా కొట్టారు. సమాచారాన్ని వెంటనే పోచారం సీఐ రాజు వర్మకు అందించగా ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గాయపడి చికిత్సపొందుతున్న చిన్నారి మరణించింది. మిగతా బాధితులు చికిత్సపొందుతున్నారు.

# సహాయక చర్యలపై రేవంత్ ఆరా..

-మొదటిపేజీ తరువాయి

లేకుండా పోయింది. మార్చి 9వ తేదీన ఒక్క మృతదేహం మాత్రమే దొరికింది. అది గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహంగా నిర్ధారించారు. మిగతా ఏడుగురి మృతదేహాల ఆనవాళ్ల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీలో అనుమానిత ప్రాంతాలుగా %ఐ1-ఐ%2 మార్క్ చేసి.. విస్తృతంగా తవ్వకాలు జరుపుతున్నారు. దేశంలోని అత్యుత్తమ ఏజెన్సీలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నా పురోగతి కనిపించట్లేదు. ఈ సొరంగం



ప్రమాదం దేశంలోనే అరుదైనదిగా నిపుణులు చెబుతున్నారు. భారీగా వస్తున్న ఊటనీరు, బురదతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సొరంగంలో 13.85వ కి.మీ. వద్ద పైకప్పు కూలింది. మట్టి, రాళ్లు, బురద, సీసీ సెగ్మెంట్స్, నీరు, టీబీఎం శిథిలాలన్నీ సొరంగంలో 11వ కి.మీ. నుంచి 13.85 కి.మీ. వరకు పేరుకుపోయాయి. నిమిషానికి 5 వేల లీటర్ల నీటి ఊట వస్తుండటంతో మట్టి తడిసి చాలా గట్టిగా మారింది. తవ్వాల్సిన మట్టి గట్టిగా ఉండటం, పైకప్పు బలహీనంగా ఉండటంతో చాలా జాగ్రత్తలు తీసుకుంటూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. తమవారు సురక్షితంగా బయటకు వస్తారని ఎదురు చూసిన కుటుంబ సభ్యులకు, బంధువులకు.. గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహం చూశాక ఆ ఆశలు ఆవిరైపోయాయి. నెల రోజుల తర్వాత కూడా మృతదేహాల కోసం బాధిత కుటుంబాలు టన్నెల్ వద్దే ఎదురుచూపులు చూస్తున్నాయి.

## దక్షిణ తెలంగాణను కేసీఆర్ ముంచాడు



-మొదటిపేజీ తరువాయి

మూడు జిల్లా పరిషత్‌లను గెలుస్తాం. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని వైఎస్సార్ చొరవతో ప్రారంభించుకున్నాం. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం బాధాకరం. ఎస్ఎల్‌బీసీ సొరంగంపై రేపు(సోమవారం) సీఎం సమీక్షించనున్నారు. 85 శాతం పూర్తయిన బ్రాహ్మణ వెల్లంలను కేసీఆర్ పూర్తి చేయలేదు" అని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 30న ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇస్తున్నామని.. సీఎం చేతుల మీదుగా హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. 80 శాతం ప్రజలు రేషన్ బియ్యాన్ని తినడం లేదు. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు అమ్ముకుంటున్నారు. తెలంగాణలో 84 శాతానికి సన్నబియ్యం ఉచితంగా ఇవ్వబోతున్నాం" అని ఉత్తమ్ తెలిపారు.

# తాను కేసీఆర్ అంత మంచోడిని కాదు

కరీంనగర్ జిల్లా పోరాటాల పురిటిగడ్డ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గారికి కరీంనగర్ జిల్లా అంటే సెంటిమెంటని, కరీంనగర్ నుంచి ఏ పని మొదలుపెట్టినా విజయవంతం అయితది అనే విశ్వాసం కేసీఆర్ గారికి ఉన్నదని, కాబట్టే పార్టీ పెట్టిన తర్వాత మొదటి బహిరంగ సభ సింహగర్జణ 2001 మే 17న ఎస్ఆర్ఆర్ కాలేజీలో పెట్టారని కేటీఆర్ చెప్పారు. నాడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ కరీంనగర్ గడ్డ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ నుంచి ఏ పని మొదలుపెట్టినా విజయవంతం అయితదని, అందుకే పార్టీ కార్యకర్తల తొలి సమావేశాన్ని కూడా కరీంనగర్‌లోనే పెట్టామని చెప్పారు. నాడు 'తెలంగాణ ఉద్యమం ఏడున్నది..? వైఎస్ సంక్షేమ పథకాల గాలిలో కొట్టుకుపోయింది' అని అప్పటి పీసీసీ అధ్యక్షుడు పిచ్చి ప్రేలాపనలు చేస్తే.. కేసీఆర్ ఉద్యమ ఊపు చూపించడానికి కరీంనగర్‌లో తన ఎంపీ పదవికి రాజీనామా చేసి మళ్లీ బరిలో దిగారని గుర్తుచేశారు. అప్పుడు కేసీఆర్‌ను ఏకంగా 2 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించి కరీంనగర్ దమ్మేందో చూపెట్టిన గడ్డ కరీంనగర్ గడ్డ అని కొనియాడారు. పోరాటాల పురిటిగడ్డ ఈ కరీంనగర్ గడ్డ అని ప్రశంసలు కురిపించారు.

బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రత్యేకమైన పార్టీ అని, ఈ దేశంలో ఎన్నో పార్టీలు పుట్టినయ్.. మాయమైపోయినయ్.. అని, ఉద్యమ పార్టీగా పుట్టి పదేళ్లు అధికార పార్టీగా వెలుగొందిన పార్టీ అని కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల తలరాతలు మార్చిందని అన్నారు. గత 16 నెలల నుంచి అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తూ ప్రతిపక్ష పార్టీ అంటే ఎట్లుండాల్నో చాటిచెబుతోందని చెప్పారు. మన పార్టీ పుట్టింది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే ఒకే ఒక్క లక్ష్యంతోనని, 25 ఏళ్ల క్రితం 2001 ఏప్రిల్ 27న పెద్దలు కేసీఆర్ గారి నాయకత్వంలో జయశంకర్ గారి లాంటి ఎంతో మంది మహానుభావుల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ పురుడుపోసుకున్నదని గుర్తుచేశారు.

**ఇయ్యాల భూమికి జానెడున్నోడు, మూడు ఫీట్లున్నోడు ఎగిరెగిరి పడుతున్నడు**

కాంగ్రెస్, బీజేపీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీలు రెండూ తెలంగాణ ప్రజలను ఏళ్లుగా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇవాళ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కేటీఆర్ లేచి నిలబడి మైకు అందుకోగానే జనం సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపైనా, రేవంత్‌రెడ్డిపైనా, బీజేపీపైన విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టిన సందర్భాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టినప్పుడు చేసిన వాగ్దానాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. 'తాను గొంగలి పురుగునైనా ముద్దాడుతా.. కుష్ఠురోగినైనా కౌగిలించుకుంటా..

## హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం..

**హైదరాబాద్:** నార్సింగీ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున కారు బీభత్సం సృష్టించింది. మితిమీరిన వేగంతో కారు డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీలు కొట్టి.. అవతల వైపు ఎదురుగా వెళుతున్న టాటా సఫారి



కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అనంద్ కామ్లే అనే వ్యక్తి అక్కడే మృతి చెందాడు. అలాగే టాటా సఫారి కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగంతో కారు రావడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి గచ్చిబౌలి వెళుతున్న కారు.. నార్సింగీ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్ ను ఢీ కొట్టింది. అవతల వైపు గచ్చిబౌలి నుండి ఎయిర్ పోర్ట్ వైపు వెళుతున్న టాటా సఫారీ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కార్లు డ్యామేజ్ అయ్యాయి. మృతి చెందిన క్యాబ్ డ్రైవర్ రాజేంద్రనగర్ శివరాంపల్లికి చెందిన ఆనంద్ కాంబ్లీగా గుర్తించారు. ఆనంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించిన నార్సింగీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# సంపాదకీయం

## భారత్ భవిష్యత్తుపై రెండు దృక్కోణాలు

తమిళనాడు పాలక పార్టీ నాయకులు, బీజేపీ రాజకీయవేత్తల మధ్య మాటల యుద్ధాన్ని రెండు భాషల (తమిళం, హిందీ) మధ్య పోరాటంగా పత్రికలలో చిత్రిస్తున్నారు. ఈ వర్ణన సరైనదే కానీ, సంపూర్ణమైనది కాదు. విశదంగా చూస్తే అధికార భాషా చర్చ రెండు భిన్న భారత్ భావనలకు ప్రాతినిధ్యం వహిస్తోంది: మొదటి భావన రాజకీయాలలోను, సంస్కృతిలోను వైవిధ్యం, వ్యత్యాసాన్ని స్వాగతించేది కాగా రెండో భావన అవ్యక్త ఆదర్శం 'ప్రమాణీకరణ, సజాతీయత, కేంద్రీకరణ'. తమిళనాడులో హిందీ పట్ల వ్యతిరేకతకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దశల వారీగానే అయినప్పటికీ పాఠశాలల్లో హిందీ బోధనను తప్పనిసరి చేసింది. ఇందుకు కారకుడు అయిన నాటి మద్రాస్ ప్రధానమంత్రి (ముఖ్యమంత్రికి అప్పటి వాడుక అది) సి.రాజగోపాలాచారి ఆ తరువాత హిందీకి వ్యతిరేకమయ్యారు. 1950వ ఆరంభం నాటికే ఆయన, ఇప్పటి తమిళ రాజకీయవేత్తలవలే, మాతృభాషకు అదనంగా ద్వితీయ భాషనేదైనా బోధించవలసివస్తే అది ఇంగ్లీషే అవ్వాలి కాని, హిందీ కాకూడదని వాదించారు. 1965లో ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా అమలుపరిచేందుకు ప్రయత్నించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఆంగ్లంలో కాకుండా హిందీలో జరగాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మద్రాసు రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆనాడు ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే హిందీ వ్యతిరేక ఆందోళనను తనకు అనుకూలంగా ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందింది. తమిళుల మనోభావాలను గాయపరిచిన హిందీ ఉత్తర్వును శాస్త్రి ఉపసంహరించుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రతిష్ఠకు తీరని విఘాతమేర్పడింది. తమిళనాట దశాబ్దాలుగా ప్రాబల్య పార్టీగా ఉన్న కాంగ్రెస్ 1967లో అధికారాన్ని కోల్పోయింది. తదాది తమిళనాడులో ఏదో ఒక ద్రావిడ పార్టీ మాత్రమే అధికారంలో ఉంటూ వస్తోంది. ఈ చరిత్ర అంతా ఎమ్‌కె స్టాలిన్, ఆయన సలహాదారులకు బాగా తెలుసు. హిందీ పట్ల తీవ్ర వ్యతిరేకత 1960ల్లో ఒక ఆధిపత్య రాజకీయ పార్టీని అధికారం నుంచి కూల్చి వేసినట్టుగానే ఇప్పుడు కూడా ఆ వ్యతిరేకత వర్తమాన ఆధిపత్య పార్టీని దూరంగా ఉంచుతుందనేది వారి సునిశ్చిత విశ్వాసం. తమిళనాడులో రాజకీయంగా విస్తరించి అధికార జయ పతాక నెగురవేసేందుకు బీజేపీ శతవిధాల ప్రయత్నిస్తోంది. నరేంద్ర మోదీ విశేష ప్రచారం కల్పించిన 'కాశీ%–%తమిళ్ సంగమం' కార్యక్రమం, కొత్త పార్లమెంటు భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠాపన, ఒక మాజీ ఐపీఎస్ అధికారిని తమిళనాడులో హిందుత్వ ఉద్ధారకుడుగా నిలబెట్టేందుకు బీజేపీ అగ్రనాయకత్వం వినియోగిస్తున్న శక్తియుక్తులను పరిశీలిస్తే తమిళనాట అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఎంతగా ఆరాటపడుతుందో అర్థమవుతుంది. హిందీ విధింపుపై తమిళనాడు వ్యతిరేకతకు రాజకీయ, సాంస్కృతిక ప్రాతిపదికలు ఉన్నాయి. అయినప్పటికీ మౌలిక రాజ్యాంగ స్ఫూర్తికి అది పూర్తిగా అనుకూలంగా ఉన్నది. 1976 వరకు విద్య రాష్ట్ర జాబితాలోని అంశంగా ఉండేది. అత్యవసర పరిస్థితి కాలంలో దానిని ఉమ్మడి జాబితాలో చేర్చారు. నిరంకుశపాలనలో ఏకపక్షంగా జరిగిన మార్పు అది. ఆ రాజ్యాంగ సవరణ ఆధారంగానే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తాను నిర్దేశించిన విద్యా విధానాన్ని అనుసరించి తీరాలని తమిళనాడును ఒత్తిడి చేస్తోంది. లేనిపక్షంలో నిధులను ఉపసంహరించకుంటామని బెదిరిస్తోంది. తమిళనాడు వైఖరిని వ్యతిరేకిస్తున్నవారు వివిధ కమిషన్లు సిఫారసు చేసిన త్రిభాషా సూత్రాన్ని ప్రస్తావిస్తున్నారు. పాఠశాల బాలలు మాతృభాష, ఇంగ్లీష్‌తో పాటు మూడో భాషనూ నేర్చుకోవాలని ఆ సూత్రం ప్రతిపాదించింది. అయితే హిందీ రాష్ట్రాలలో మూడో భాషగా సంస్కృతాన్ని మాత్రమే బోధించడం జరుగుతోంది. యూపీ, బిహార్‌ల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమిళం లేదా కన్నడం లేదా బెంగాలీ లేదా మలయాళ భాషను ఎన్నడూ మూడో భాషగా బోధించిన దాఖలాలు లేవు. కనీసం మరాఠీ లేదా గుజరాతీని సైతం బోధించలేదు. ఈ త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అమలుపరచలేదు. ఉత్తరాది రాష్ట్రాలలో అది ఆచరణలో ఎలా పరిణమించిందన్నది తమిళనాడు అభ్యంతరాలను ధ్రువపరిచింది. జాతీయ సమైక్యతను పెంపొందించడానికి బదులుగా ప్రభుత్వ ప్రాయోజిత హిందీ విస్తరణ వాదానికి త్రిభాషా సూత్రం ఒక అనుద్దేశపూర్వక సాధనమయింది. సరిగ్గా ఈ కారణంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కూడా త్రిభాషాసూత్రాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ విషయమై ప్రధానమంత్రి మౌనంగా ఉన్నప్పటికీ హోం మంత్రి మాత్రం విభిన్న రాష్ట్రాల మధ్య కమ్యూనికేషన్ మాధ్యమంగా హిందీ మాత్రమే ఉండాలని ఉంటుందని పదే పదే ఉద్ఘాటిస్తూ వస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడే భారతీయుల పట్ల తన అయిష్టతను సైతం ఆయన పదే పదే వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 1965 నుంచి 2014 దాకా అర్ధ శతాబ్దం పాటు హిందీయేతర రాష్ట్రాలలో హిందీని ప్రోత్సహించేందుకు కేంద్రం శ్రద్ధగా ప్రయత్నించలేదు. అయినప్పటికీ హిందీ దేశ వ్యాప్తంగా వ్యాపించింది. అంతర్ రాష్ట్ర వలసలు, మరీ ముఖ్యంగా సినిమాలు, టీవీ మాధ్యమం ద్వారా ఆ భాషా వ్యాప్తి జరిగింది. బాంబే హిందీ సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఉపయోగించే హిందీ మృదువైన, వ్యవహారిక హిందుస్థానీయే గానీ ఆకాశవాణి, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో ఉపయోగించే సౌలభ్యమూ, సౌందర్యమూ కొరవడిన, మితిమీరిన స్థాయిలో సంస్కృతీకరణ అయిన హిందీ కాదు. మోహన్ భగవత్ ఇటీవల కేరళలో ఒక సమావేశంలో మాట్లాడుతూ హిందువులు ఆంగ్ల భాషను త్యజించాలని కోరారు. ఒకప్పుడు లోహియా వలే ఇప్పుడు ఆరెస్సెస్ అధినేత కడా ఇంగ్లీష్‌ను ఆంగ్ల మానస పుత్రులైన భారతీయుల భాషగా పరిగణిస్తున్నారు. వలసపాలన భావ దాస్యంలో ఉన్నవారు ఆ భాషను ఔదలదాలుస్తున్నారనేది వారి ఆరోపణ. ఇంగ్లీష్ త్వరలోనే భారత్ నుంచి బహిష్కృతమవుతుందని లోహియా భావించారు. ఆయన ఆశించినట్టు జరగ లేదు. ముఖ్యంగా 1990ల నుంచి ఇంగ్లీష్ శీఘ్రగతిన వ్యాప్తి చెందింది. ప్రభుత్వ ప్రాపకం ద్వారా కాకుండా ఇతరేతర రీతుల్లో అది వ్యాప్తి చెందింది. సాఫ్ట్‌వేర్ బూమ్ ఇందుకొక ప్రధాన కారణం. మన ఇంజినీరింగ్ కళాశాలలు అన్నీ ఇంగ్లీష్‌లోనే బోధించడం వల్లే అది సంభవించింది. సామాజిక చలనశీలతకు మార్గంగా, వృత్తిపరమైన పురోగతికి సోపానంగా, విశాల ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ఒక ప్రధాన గవాక్షంగా ఆంగ్ల భాష గుర్తింపు, ప్రాధాన్యాన్ని పొందింది. ఆధునిక వృత్తులలోకి ప్రవేశించేందుకు దళితులు ఆంగ్ల భాషను నేర్చుకుని తీరాలని ప్రముఖ మేధావి చంద్రభాన్ ప్రసాద్ చాలా సంవత్సరాలుగా వాదిస్తున్నారు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యాలు లేక పోవడం వల్లే ఆధునిక వృత్తులలో దళితుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని ఆయన విశ్వసిస్తున్నారు. 'ఇంగ్లీష్ సివంగి పాలు వంటిది, ఆ పాలను తాగిన వారే గర్జించగలరన్న' అంబేడ్కర్ మాటలను తన వాదనకు మద్దతుగా ఆయన తరచు ఉటంకిస్తుంటారు. మాతృభాషా అభిమానంతో కన్నడ సాహిత్యలోక దిగ్గజాలు పాఠశాలల్లో ఆంగ్ల భాషను బోధించ వద్దని విజ్ఞప్తి చేసినప్పుడు దళిత మేధావులు గర్జిస్తూ ఇలా ప్రతిస్పందించారు: తొలుత మీరు మాకు సంస్కృతాన్ని నిరాకరించారు. ఇప్పుడు ఇంగ్లీష్‌నూ అదే విధంగా నిరాకరిస్తున్నారు. మీ అగ్రకుల ప్రాముఖ్యాన్ని, నిలబెట్టుకునేందుకే మీరు ఇలా చేస్తున్నారు. నరేంద్ర మోదీ అధికారానికి రావడానికి ముందు కాలంలో హిందీ, ఇంగ్లీష్ రెండూ దేశవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందాయి. వ్యాకరణ సమ్మతంగా రాయలేక పోయినప్పటికీ, స్ఫుటంగా మాట్లాడలేకపోయినప్పటికీ ఇప్పుడు చాలా మంది భారతీయులు ఆ రెండిటిలో ఏదో ఒక భాషను గానీ లేదా రెండిటినీ గానీ అర్థం చేసుకోగలుగుతారు. హిందీయేతరులు హిందీని, భారతీయులు ఇంగ్లీష్‌ను ఇలా ఆదరంగా స్వీకరించడమనేది స్వచ్ఛందంగా, స్వతస్సిద్ధంగా జరిగిందని చెప్పి తీరాలి. ఇది దేశ ప్రజలపై రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆరోగ్యకరమైన ప్రభావాన్ని చూపింది. విషాదేమేమిటంటే ఈప్రక్రియ మరింత ప్రగతిశీలంగా ముందుకు సాగకుండా సంఘ్ పరివార్ రాజ్యాధికారాన్ని ఉపయోగించి ఆంగ్లాన్ని అణచివేసి హిందీని సర్వత్రా ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోంది. హిందువులు మాత్రమే ఈ దేశ సహజ పౌరులు అన్న వారి సంకుచిత విశ్వాసం వల్లే ఇలా వ్యవహరించడం జరుగుతోంది. భాషా రంగంలో జాతీయ సమైక్యతకు హిందీ ఉపయోగపడుతుందని వారు విశ్వసిస్తున్నారు. హిందువులే ఈ దేశ నిజమైన పౌరులు అని చెప్పుతూ భారతీయ ముస్లింలను తులనాడుతూ అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న ప్రయత్నాలను ఇదే కాలమ్‌లో గతంలో పలుమార్లు వివరించాను. అయితే నేను తమిళనాడులో ఓటు వేయడం లేదు. కుటుంబ పాలన విషయంలో

# కొంటే... కొరివి దయ్యమే!




"భారత్ ఒక సరికొత్త ప్రపంచానికి అలవాటు పడాల్సిన అవసరం ఉంది" ట్రంప్‌ను ఉద్దేశించి విదేశీ వ్యవహా రాల మాజీ కార్యదర్శి ఒకరు అన్న మాట. ఈ కొత్త ప్రపంచం కేవలం ఒప్పందాలు, వ్యాపారాలకు మాత్రమే పరిమితమనీబీ మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరనీ కూడా ఆయన అన్నారు. ఒక దౌత్యవేత్త ఈ అంచనాకు వచ్చారంటే కచ్చితంగా అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ అనూహ్యమైన వ్యక్తిత్వమే కారణమై ఉంటుంది. తేలిగ్గా చెప్పాలంటే... ఈ రోజుల్లో పరిస్థితి నాటకీయంగా మారిపోయింది. కొత్త సంవత్సరంలో యూఎస్‌ఏ తన లావా దేవీలను వేగంగా మొదలు పెట్టేసింది. ఈ ఏకపక్ష ధోరణితో అమెరికా మిత్రులు, శత్రువులు కూడా తమని తాము కాపాడు కునేందుకు దాక్కుండిపోతున్నారు. లేదంటే వ్యక్తిగతంగా ట్రంప్ ముందు ప్రత్యక్షమై ఆయన శీతకన్ను పడకుండా ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండింటి వల్ల కూడా ఏదో అర్థవంతమైన పని జరుగుతుందని ఎవరూ ఆశించడం లేదు. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే... ట్రంప్ ఇప్పుడు అమెరికన్ కంపెనీ 'లాక్‌హీడ్ మార్టిన్ ' తయారు చేసిన ఎఫ్–35 యుద్ధ విమానాలు కొనమని భారత్‌కు చెబుతున్నారు. భారత్‌తో ఉన్న సుమారు 3,500 కోట్ల డాలర్ల వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు అన్నమాట. అయితే ఏ అంత ర్జాతీయ ఒప్పందం, వ్యాపారమైనా కేవలం అమ్ముతామంటే సరిపోదు. కొంటున్నామని అవతలి వారు చెప్పాలి. భారత్‌దృష్టి కోణం నుంచి చూస్తే %–% అమెరికా అమ్ముతానూ అంది, మరి కొనదలుచుకుంటే ఆ ఎఫ్%–%35 యుద్ధ విమానాలు ఎలాంటివో పరిశీలించాలి కదా?

### తడిసి మోపెడు ఖర్చు

రవాణా, గాల్లోంచి సామగ్రి పడవేసే 'డగ్లస్ డీసీ%–%3 డకోటా', 'ఫెయిర్ ఛైల్డ్ ప్యాకెట్ సీ119 జీ' మినహా మరే ఇతర అమెరికా విమానాన్నీ భారతీయ వైమానిక దళం ఇంతవరకు వాడలేదు. 1947 నుంచి చూసినా అమెరికా యుద్ధ విమానం మన వద్ద ఎప్పుడూ లేదు. కాబట్టి అకస్మాత్తుగా ఎఫ్–35లను కొనుగోలు చేయడం అంటే, అది కూడా ట్రంప్ మాటపై ఆధారపడి అంటే... కొంచెం అనుమానంగా చూడాల్సిన వ్యవహారమే! అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు, చరిత్ర లను పరిగణనలోకి తీసుకుంటే ఇలా చూడటం మరీ ముఖ్య మవుతుంది. ఒక విషయమైతే స్పష్టం. భారత్ వంటి అతిపెద్ద దేశంలో వైమానిక దళం ఒక్క రోజులో సిద్ధం కాదు. వైమానిక దళాన్ని నిర్మించడం అంత తేలికైన వ్యవహారమూ కాదు. భారీ పెట్టు బడులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, రిస్క్ తీసుకో గలిగిన తెగువ, సుశిక్షితులైన సిబ్బంది అవసరం. 'జేన్ ్స ఆల్ ద వరల్డ్స్ ఎయిర్ క్రాఫ్ట్' మ్యాగజైన్‌ప్రకారం... ఎఫ్–35 యుద్ధ విమానాలకు (ఐదో తరం, బహుళార్థక, స్టెల్త్ రకం) ఆర్డర్ పెట్టిన తరువాత మొదటి విమానం అందేందుకు 15 ఏళ్లు పడుతుంది! ఇంకో విషయం – భారత్ ఏ రోజు కూడా లాక్ హీడ్ తయారు చేసే యుద్ధ విమానపు కొనుగోలుదారుగా కానీ, అమెరికా పారిశ్రామిక భాగస్వామిగా కానీ లేదు. నిజానికి ఎఫ్–35 యుద్ధ విమానాలు హైటెక్ పాశ్చాత్య దేశాల కోసం, అమెరికా రక్షణకు, సెక్యూరిటీ భాగస్వాములైన ఇతర దేశాల కోసం ఉద్దేశించినవి. 1996లో ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, ఇజ్రాయెల్, సింగపూర్, స్పెయిన్ , స్వీడన్ లకు ఈ కార్యక్రమం గురించి వివరించారు. ఎఫ్–35లు ఖరీదైనవని అప్పుడే అర్థమైపోయింది (ట్రంప్ సుంకాల తీరుతో తాజాగా నాటో దేశాలు కూడా వీటి కొనుగోలు గురించి పునరాలోచనలో పడ్డాయి). ముందుగా యూకేతో కలిసి పనిచేయాలని, పది శాతం ఖర్చులు ఆ దేశం భరించాలని యూఎస్‌తో ఒప్పందం జరిగింది. ఇటలీ, నెదర్లాండ్స్ చెరి ఐదు శాతం ఖర్చులు భరించేలా ఒప్పందాలు కుదిరాయి. మూడో దశలో డెన్మార్క్, నార్వే... 1%–%2 శాతం ఖర్చులు భరించేలా భాగస్వాములైనాయి. అనంతరం, ఆస్ట్రేలియా, కెనడా, టర్కీ తమ ఖర్చు తామే భరించేలా చేరాయి. 2012–13 నాటి 'జేన్ ్స ఆల్ ద వరల్డ్స్ ఎయిర్‌క్రాఫ్ట్' పత్రికను చూస్తే ఒక్కో ఎఫ్–35ఎ యుద్ధ విమానం ఖరీదు సుమారు 3.73 కోట్ల డాలర్లు. 2017 నాటికి ఇది 9.43 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇప్పుడు సుమారు పది కోట్ల డాలర్ల పైమాటే (రూ.860 కోట్లు). మారకం విలువలు, రూపాయి బలహీనపడటం వంటివి కూడా పరిగణనలోకి తీసుకుంటే ఎఫ్–35ల కొనుగోలు భారత్ ఖజానాకు భారీగా కన్నమేసేదే! ఇంత భారీ ఖర్చు కచ్చితంగా రాజకీయంగానూ సంచలనంసృష్టిస్తుంది. దీంతోపాటే ఎఫ్–35 యుద్ధ విమానాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞాన సంబంధిత సమస్యలు చాలానే ఉన్నాయి. అమెరికాలోనూ దీని గురించి వివాదాలు ఉన్నాయి. సమస్యలు ఒకవైపు, ఎప్పటికప్పుడు పెరిగిపోయే ఖర్చులు ఇంకోవైపు ఈ యుద్ధ విమానపు కొనుగోలుపై సందేహాలు లేవనెత్తుతున్నాయి. ఆర్థికాంశాలు, సాంకేతిక పరిజ్ఞాన అంశాలూ కాసేపు పక్కన పెడదాం. యుద్ధ విమానం భద్రత కూడా ఇక్కడ ప్రశ్నా ర్థకమే. 2010 అక్టోబరులో ఇలాంటి ఒక సమస్యను గుర్తించారు. విమానం ఎగురుతూండగానే ఎలాంటి ఆదేశాలూ లేకుండానే ఇంజిన్ ఆఫ్ అయ్యేందుకు వీలు కల్పించే ఓ సాఫ్ట్ వేర్ సమస్య తలెత్తింది. అప్పట్లో ఎడ్వర్డ్స్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో ఈ విమానాలను కొంత సమయం పాటు నిలిపివేశారు కూడా! పదిహేనేళ్లు దాటిపోతున్నా ఇప్పటికీ ఈ యుద్ధ విమానం ప్రయాణిస్తూండగా సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. 2014 జూన్ , జూలైల్లో ఎగ్లిన్ ఎయిర్‌ఫోర్స్ స్థావరం వద్ద కొన్నింటిలో ఇంజిన్ వైఫల్యం చోటు చేసుకుంది. ఈ ఘటన తరువాత వాటి వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కనుక అలాంటి విమానాలను కొని, కొరివితో తలగోక్కునే పరిస్థితిని భారత్ తెచ్చు కోదనే ఆశిద్దాం!

# సుంకాలపై సమష్టి పోరాటం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ షేక్ స్పియర్‌ను చదివారో లేదో గాని ఆ మహాకవి మాటలలోని సత్యాన్ని బాగానే గ్రహించారు: 'స్నేహంలో చిత్తశుద్ధిలేని ముఖస్తుతి ఉన్నది'. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయిన తన స్నేహితుడు డోనాల్డ్ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తిన మోదీ వలసలు, వీసాలు, వాణిజ్య సమతుల్యత, సుంకాలు, అణు ఇంధనం, దక్షిణ చైనా సముద్రం, బ్రిక్స్, క్వాడ్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మొదలైన అంశాలపై స్వదేశానికి అనుకూలంగా ట్రంప్‌తో సంప్రతింపులు జరపగలననే ఆశాభావంతో ఉన్నారు. అధ్యక్షుడు ట్రంప్ నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉంటారు. అంతకు మించి ఉండరు. ప్రధానమంత్రి నరేంద్రీ మోదీ మూడో పదవీ కాలం ఇంకా నాలుగు సంవత్సరాలు ఉన్నది. మరోసారి కూడా ప్రధానమంత్రి కావాలని ఆయన ఆశిస్తున్నారని చెప్పవచ్చు. అయితే నాలుగు సంవత్సరాల ఉమ్మడి వ్యవధిలో సమస్యలు అన్నిటినీ పరిష్కరించడం సాధ్యం కాదన్నది స్పష్టం. రాబోయే అమెరికా ప్రభుత్వం రిపబ్లికన్ పార్టీది అయినా, డెమొక్రాటిక్ పార్టీది అయినా ట్రంప్ విధానాలను కొనసాగించక పోవచ్చు. ఈ సంభావ్య పరిణామమే భారత్‌కు మొదటి పాఠం కావాలి. ప్రభుత్వాధినేతల మధ్య వ్యక్తిగత స్నేహ సంబంధాలకు అతీతంగా పరిస్థితులను సమగ్రంగా చూడాలి. ట్రంప్ గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? ఆయనకు ఒక స్నేహితుడు ఎప్పుడు శత్రువు అవుతాడో, ఒక శత్రువు ఎప్పుడు మిత్రుడు అవుతాడో ఎవరూ చెప్పలేరు. పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రధాని మోదీ ఘనంగా ప్రశంసించారు. ఆయన వినమ్రతను, కష్టాల నుంచి బయటపడగల శక్తిని బాగా మెచ్చుకున్నారు. ద్వితీయ పర్యాయం అధ్యక్ష పదవీ కాలంలో సాధించాల్సిన లక్ష్యాల విషయమై ట్రంప్ మొదటిసారి కంటే బాగా సన్నద్ధమయ్యారని మోదీ అన్నారు. ఆయనకొక మార్గదర్శక ప్రణాళిక ఉన్నదని, వేసే ప్రతి అడుగు లక్ష్య పరిపూర్తికి తోడ్పడేదిగా ఉంటుందని మోదీ అన్నారు. మోదీ ఇంకా ఇలా అన్నారు: 'తాను నిర్దేశించిన లక్ష్యాలను సాధించగల శక్తిమంతమైన పాలనాదక్షుల బృందానికి బాధ్యతలు అప్పగించారు. సమర్థులైన ఆ అధికారులు అధ్యక్షుడు ట్రంప్ దార్శనికతను అమలుపరచగలరని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను'. అమెరికా ప్రజలు అందరూ ఈ ప్రశంసతో ఏకీభవించకపోవచ్చు. సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు అందరూ ఆయా ప్రభుత్వ విభాగాలకు ట్రంప్ ఎంపిక చేసుకున్న అధికారులు అందరూ శక్తి మంతులని, పాలనా దక్షులని భావించడం లేదు. ట్రంప్ దార్శనికత అమెరికాకు గానీ, ప్రపంచానికిగానీ శ్రేయస్సును సమకూర్చేదని అమెరికా



ప్రజలు అందరూ భావించడం లేదు. డోనాల్డ్ ట్రంప్ తన దార్శనికతను అమలుపరచడమనేది భారత్‌కు శుభవార్త కాబోదు. తన లక్ష్యాల పరిపూర్తిలో ట్రంప్ సఫలమయితే దాని పర్యవసానాలు భారత్‌కు ఎలా ఉంటాయో చూద్దాం: సరైన పత్రాలు లేకుండా అమెరికాకు వలస వెళ్లిన భారతీయులు (దాదాపు 7 లక్షల మంది అని అంచనా) దాదాపుగా అందరినీ తిరిగి భారత్‌కు పంపించి వేస్తారుబీ అమెరికాలో గ్రీన్‌కార్డ్ ఉన్న భారతీయులకు అమెరికా శాశ్వత పౌరసత్వాన్ని నిరాకరించే అవకాశమున్నదిబీ విద్యార్థికులు, వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్ 1బి వీసాల జారీని గణనీయంగా తగ్గించివేస్తారుబీ హార్లే డేవిడ్‌సన్ బైక్‌లు, భౌర్బన్ విస్కీ, జీన్స్, ఇతర అమెరికన్ సరుకులపై దిగుమతి సుంకాలను తగ్గించడం భారత్‌కు అనివార్యమవుతుందిబీ భారత్ నుంచి అల్యూమినియం, ఉక్కు ఎగుమతులు, బహుశా ఇంకా ఇతర భారతీయ సరుకులపై అమెరికా భారీ స్థాయిలో సుంకాలు విధించే అవకాశమున్నదిబీ భారత్‌లో ఉద్యోగాలను సృష్టించే పరిశ్రమలను నెలకొల్పకుండా అమెరికన్ ప్రైవేట్ పెట్టుబడులను నిరుత్సాహపరుస్తారు. అంతర్జాతీయ సంబంధాలలో ట్రంప్ పోకడల విషయాన్ని చూద్దాం. పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటే నరేంద్ర మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? ఆ సముద్ర మార్గంలో భారత్, ఇతర దేశాల ఓడల రాకపోకలకు అనుమతించినంతవరకు ఎవరూ నిరసన తెలుపకపోవచ్చు. అయితే పనామా కాలువను అమెరికా తన నియంత్రణలోకి తీసుకోవడమనేది నిస్సందేహంగా ఒక దురాక్రమణే. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడమే. గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా అమెరికా స్వాయత్తం చేసుకుంటే మోదీ ఏ విధంగా ప్రతిస్పందిస్తారు? గ్రీన్‌ల్యాండ్ మనకు సుదూరంలో ఉన్న దీవి కనుక, అమెరికా చర్యకు మనం ఆందోళనపడవలసిన అవసరం లేదని భారత్ భావిస్తుందా? కొన్ని 'దురాక్రమణలను' క్షమించవచ్చుగానీ రష్యా మరిన్ని ఉక్రెయిన్ ప్రాంతాలను, తైవాన్‌ను చైనా స్వాధీనం చేసుకుంటే భారత్ ఏ విధంగా ప్రతిస్పందిస్తుంది? ఆక్సాయిచిన్, అరుణాచల్‌ప్రదేశ్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు చైనా ప్రయత్నిస్తేనో?! భారత్, చైనాల మధ్య యుద్ధం తప్పక సంభవిస్తుంది. ఆ యుద్ధంలో మనకు మద్దతుగా ఏ దేశం నిలబడుతుంది? ఆధునిక దౌత్యం వ్యక్తిగత స్నేహాలను మించిన వ్యవహారం. డెమొక్రాటిక్ పార్టీతో నెలకొల్పుకున్న స్నేహ సంబంధాలను వదులుకుని ట్రంప్ పార్టీకి మోదీ మళ్లీ ప్రాధాన్యమిస్తారా? ఏది ఏమైనా జనవరి 20, 2029 తరువాత ట్రంప్ అధికారంలో ఉండరు. తదుపరి అధ్యక్షుడు డెమొక్రాటిక్ పార్టీకి చెందిన నాయకుడు కావచ్చు. గత పది సంవత్సరాలుగా దేశీయ పరిశ్రమల సంరక్షణ విధానానికి నరేంద్ర మోదీ ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. ఆయన దాన్ని ఘనంగా ఆత్మనిర్భరత అని చాటుతున్నారు. తన స్నేహితుడు డాక్టర్ అర్వింద్ పనాగరియాతో సహా పలువురు ఆర్థికవేత్తల విజ్ఞతాపూర్వక సలహాలు, సూచనలను పెడచెవిని పెట్టి మోదీ ప్రభుత్వం 500కు పైగా సరుకుల దిగుమతులపై సుంకాలు, సుంకాలేతర చర్యలు చేపట్టింది. భారతీయ సరుకులపై అమెరికా వసూలు చేస్తున్న అధిక సుంకాలపై మోదీ నిరసన తెలిపినప్పుడు ఆయన ఆక్షేపణలను ట్రంప్ మహాశయుడు పూర్తిగా కొట్టివేశాడు. ఏప్రిల్ 2, 2025 నుంచి పూర్తి స్థాయిలో సుంకాల సమరాన్ని ప్రారంభించేందుకు ట్రంప్ ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ట్రంప్‌తో మోదీ దోస్తీ, ముఖ ప్రీతి మాటలు బాగానే ఉన్నాయి గానీ, ట్రంప్ సుంకాల సమరం నుంచి ఇండియాను మినహాయించడానికి అవి తోడ్పడుతాయా? ట్రంప్ విధించే ప్రతీకార సుంకాలను భారత్ ప్రతిఘటిస్తుందా? సూత్రబద్ధ చర్చలు, సంప్రదింపులే దౌత్యానికి హృదయం వంటివి. ముఖస్తుతి మాటలు ఎంతమాత్రం దౌత్య వ్యవహారం కాబోవు. ఆచరణాత్మక వైఖరి నిండుగా ఉన్న ఫ్రిడ్రిచ్ మెర్జ్ (కాబోయే జర్మన్ ఛాన్సలర్), ట్రంప్ విసురుతున్న సవాళ్లకు దీటుగా ప్రతిస్పందిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, 27 యూరోపియన్ యూనియన్ దేశాలను సంఘటితం చేసిన యూరోపియన్ కమిషన్

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదల కోసం పోరాటాలు చేపట్టాలి

**ఏఐటీయూసీ గుర్తింపు సంఘం-యాజమాన్యంపై ఒత్తిడీ**

**కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర తిరుపతి.**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచుకోవడానికి సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో పోరాటాలను చేపట్టాలని,గుర్తింపు కార్మిక సంఘం-ఏఐటియుసి యాజమాన్యం పైన, ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచుతున్నట్లుగా,స్ట్రక్చర్ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించినట్లుగా ఏఐటియుసి నాయకులు తెలిపారు. ఆదివారం నాడు గోదావరిఖనిలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్-ఏఐటియుసి సమావేశం యూనియన్ అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్-ఏఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, కామ్రేడ్ కే రాజకుమార్ లు పాల్గొని మాట్లాడార సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరగక కొన్ని సంవత్సరాలు పాటు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారని,వీరి వేతనాలు పెంచడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందినదని, ప్రస్తుత ప్రభుత్వం మరియు యాజమాన్యం ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే వేతనాలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఎస్ ఐ అమలు చేయాలని, చట్టబద్ధంగా రావాల్సిన హక్కులను, సెలవులను అమలు చేయాలని,పెనాల్టీ విధానాన్ని రద్దు పరచాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 7వ తేదీన సింగరేణి యాజమాన్యంతో సి అండ్ యండి స్థాయిలో జరిగిన స్ట్రక్చరల్ సమావేశం సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు చొరవుతో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, పెండింగ్ లో ఉన్న సమస్యను పరిష్కరించాలని చర్చించినట్లుగా తెలిపారు. ప్రతినెల ఏడవ తేదీ లోపు అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలను చెల్లించాలని,15 శాతం కన్వేయన్స్ వెహికల్ హడహక్ అమౌంట్ విషయం తేల్చాలని,వెహికల్ ట్రాకింగ్ సిస్టం లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.చట్టబద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన సౌకర్యాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు కార్యక్రమాలను రూప కల్పన చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్-ఏఐటియుసి అధ్యక్షులు బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి.ఎం.డి.అక్బర్ అలీ,యూనియన్ ఇన్ చార్జి ముస్కే సమ్మయ్య, నాయకులు మడ్డి ఎల్లా గౌడ్,యర్రగాని కృష్ణయ్య, క్రిష్టా ఫర్,రత్నం, చంద్రమౌళి,గౌస్,జెట్టి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఒక రోజు టోకెన్ సమ్మె కు పిలుపు

**సింగరేణి కి 40 వేల కోట్ల బకాయిలు ఇప్పించండి.**

**కొత్త గనులు వస్తనే సింగరేణి కి మనుగడ.**

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,**

**అగ్నిధారన్యూస్,( రామగుండం):** సింగరేణి కి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ సుమారు 40 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించి సంస్థ ఆదుకోవాలని, కొత్త గనులు వస్తనే సింగరేణి కి మనుగడ కొనసాగుతుందని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య లు పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని లో జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర ఆఫీస్ బేరర్స్ బ్రాంచి కార్యదర్శుల సమావేశం లో వారు పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి కి చెందిన బొగ్గు, కరెంట్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వాడు కున్నందున సంస్థ కు రావాల్సిన సుమారు 40 వేల కోట్ల రూపాయలు ఇంత వరకు చెల్లించలేదని, ఇట్టి బకాయిలు కంపెనీకి రాకపోవడం మూలంగా కార్మికులకు జీతాలు చెల్లించే విషయంలో అప్పులు తేవాల్సి వస్తుందని, కొత్త యంత్రాలు, ఇతరత్రా మెటీరియల్ తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి బకాయిలు చెల్లించి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చాలని వారన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మే 20 న సింగరేణి లో కూడా ఒక రోజు టోకెన్ సమ్మె చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల వల్ల సింగరేణి లో నూతన బొగ్గు గనులు రావడం లేదని, ఉన్న బొగ్గు గనుల్లో బొగ్గు నిల్వలు ఇంకో పది సంవత్సరాల వరకు పూర్తయితాయని, దీని వల్ల తెలంగాణ లో సింగరేణి సంస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి నూతన గనులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి లో గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత కార్మికుల కు ఇచ్చిన హామీలను అమలు కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. సింగరేణి లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం తో జరిగే వివిధ రకాల సమావేశాల్లో అనగా జి.ఎం. స్థాయి నుంచి సి అండ్ ఎండి స్థాయి వరకు సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం గా ఏఐటియుసి ఒత్తిడి పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే పలు మార్లు జరిగిన సమావేశాల్లో అలవెన్సుల పై ఆదాయపు పన్ను మినహాయింపులు, స్వంత ఇంటి పథకం అమలు, పదకొండు రకాల అలవెన్సులను పెంచుటకు, డిస్మిస్ ఐన కార్మికులకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చేందుకు, మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల డిపెండెంట్ లకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం అమలు చేయడం కోసం కమిటీ వేసి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు వాటి అమలు కోసం కమిటీలు వేయలేదని, వెంటనే కమిటీలు వేసి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా త్వరలో జరిగే డైరెక్టర్ ఫా స్థాయి సమావేశంలో పలు వృత్తులకు సంభందించిన డిజిగ్నేషన్ ల మార్పు కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. సింగరేణి లో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు గుర్తింపు సంఘం ఏఐటియుసి కృషి చేస్తుందని వారు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లా గౌడ్, ఎల్ ప్రకాష్, కవ్వంపల్లి స్వామి, అక్బర్ అలీ, జూపాక రాంచందర్, ఆరెల్లి పోషం, జీగురు రవిందర్, మందల రాంచంద్రారెడ్డి, బాజీసైదా, ఎస్ తిరుపతి, వై.రాంగోపాల్, కొట్టె కిషన్ రావు, ఎం.కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ వేడుకల సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అందరిని సుఖంగా చూడాలని వారు చేస్తున్న ప్రార్ధనలో భాగంగానే ఈరోజు మొత్తం మనం భారతదేశానికి సంబంధించి ఒక సమలికృత విధానంలో సెక్యులర్ భావాలతో నడుస్తున్నామన్నారు. మన సమాజంలో వీరందరూ కూడా పెద్ద పాత్రధారులు. ఈ సంవత్సరం మా ప్రభుత్వం ఎప్పుడు లేని విధంగా రూ. 3 వేల పైచిలుకు కోట్లను బడ్జెట్లో పెట్టడం జరిగిందన్నారు మొట్టమొదటిసారి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అందరికీ కూడా మేలు చేయాలని ఎప్పుడో మూలబడ్డ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చదువుకునే యువతకి మైనారిటీలకు స్వయం ఉపాధి పథకాలతో పాటు నాలుగు పర్సెంట్ రిజర్వేషన్లను కొనసాగిస్తున్నామన్నారు.గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ, గ్రూప్ ఫోర్ కు సంబంధించి మొన్న దాదాపు వందలాది మందికి గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహిస్తే మా మైనారిటీ సోదరులకు అనేకమంది కూడా గ్రూప్ వన్ పరీక్షలు లో ఉత్తీర్ణులైనారని అన్నారు. గ్రూప్ ఫోర్ అధికారుల నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా మైనార్టీ ఉద్యోగాల్లో కూడా వారికి ప్రవేశ పొందడానికి ఒక ఆస్కారము ఒక అవకాశం తీసుకునే కార్యక్రమం చేశామన్నారు. ఇప్పుడు మన నియోజక వర్గం విషయానికి వస్తే నా పైన గురుతరమైన బాధ్యత ఉందన్నారు. మీరు చేసే ప్రతి కార్యక్రమం విషయంలో ప్రభుత్వంలో నేను ఉన్నాను గనుక, మీ అందరికీ నేను ఎలక్షన్లో చెప్పిన విధంగా ఇంకా ఏదైనా చేయాలని ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు ఫంక్షన్ హాల్, మ్యారేజ్ హాల్,ఇండ్లు, కాంప్లెక్స్ కు సంబంధించినవని తెలిపారు. మా ముస్లిం మైనారిటీ సోదరులకు వారి కుటుంబ సభ్యులందరికీ రంజాన్ పవిత్ర మాసంలో మీ అందరికీ కూడా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూన్నానన్నారు. ఈద్గా విషయం తప్పకుండా పరిశీలన చేస్తానని అన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణంలోని రోషిణీ డిగ్రీ కళాశాలలో 2007- 2010 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం మంథని బిఎస్ బాక్వ్యాట్ హాల్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని చేపట్టారు.తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.ఈ సంధర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.చాలా సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సింగిరెడ్డి దంపతులు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** హైదరాబాద్ కొకూరు మస్తాన్ దర్గాలో రాయిగడ్డ (వనపర్తి)కి చెందిన తైలంరమేష్ చేసిన కందూర్ కార్యక్రమములో మాజీమంత్రి సింగిరెడ్డి.వాసంతి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలునిర్వహించారు.అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ముస్లిం పెద్దలు మాజీ మంత్రి నిరంరెడ్డి దంపతులను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిని సన్మానించిచారు.

# కేకే.ఓ.సీ.పీ నీ సందర్శించిన అధికారులు..



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం మార్చి 23 :** మందమర్రి ఏరియా జీ.ఎం జి.దేవేందర్ తో కలిసి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ ),% (పీ ఏ % డబ్ల్యూ),పా,వెంకటేశ్వర్లు ఏరియాలోని కే.కే ఓ.సీ.పీ సందర్శించారు,వారికి జీ జి.ఎ దేవేందర్ మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.తదుపరి పని ప్రదేశాలు పరిశీలించడంతో పాటు, ఉత్పత్తి,ఉత్పాదకత పై సమీక్షించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సలహాలు,సూచనలు అందించారు. ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులభం అవుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో.. బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జి.ఎం రఘు కుమార్, ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, కే.కే.ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య,కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు,ఏరియా ఇంజనీర్ వెంకటరమణ,ఏరియ సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, మరియు అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్స్ గర్జన జయప్రదం చేయండి

**టి వి ఏసి జేఏసీ పెద్దపల్లి జిల్లా కో చైర్మన్ దుర్గం విశ్వనాథ్**



**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):** విద్యుత్ సంస్థలో పనిచెస్తూన్న ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలని మార్చ్ 25 వ తేదిన హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద టి వి ఏసి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టినఆర్టిజన్ల గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని

పెద్దపల్లి టీవీ ఏసి జేఏసీ పెద్దపల్లి జిల్లా కో చైర్మన్ దుర్గం విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేసినటువంటి ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ చేయాలని, విద్యార్హతను బట్టి వారికి సబ్ ఇంజనీర్, జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులని ఇవ్వాలని అనేక దపాలుగా పోరాటాల నిర్వహిస్తున్న ప్రభుత్వ పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నికల ముందు ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క పాదయాత్రలో కార్మికులకు ఏం చేస్తామని ఇచ్చినట్లు గుర్తు చేశారు. అదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లడం జరిగిందన్నారు, మేనేజ్మెంట్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందనీ, 20వేల మంది ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 25వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అయినా కూడా ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయకపోతే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వం,మేనేజ్మెంట్ బాధ్యత వహించాలని హెచ్చరించారు'

# బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ముల్కల్ల రాజేంద్రప్రసాద్..



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం మార్చి 23 :** మంచిర్యాల జిల్లా కేంద్రం చార్వాక సమావేశ ప్రాంగణం నందు బహుజన్ సమాజ్ పార్టీ అసిఫాబాద్, మంచిర్యాల జిల్లా సమీక్ష సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ కోఆర్డినేటర్ నిషాని రామ్ చందర్,జోనల్ కోఆర్డినేటర్ అడ్వకేట్ జగన్మోహన్ కాదాసీ రవీందర్ ఈసీ మెంబర్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో.. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ ను నియమించారు. సెంట్రల్ కోఆర్డినేటర్ నిషాని రామ్ చందర్ మాట్లాడుతూ... మంచిర్యాల, అసిఫాబాద్ జిల్లాలో బూత్ సాయి నుండి పార్టీని పటిష్ట పరచాలని,ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయన్నారు.42 శాతం రిజర్వేషన్ పేరుతో బీ సీ లను రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నారని, మండిపడ్డారు.బీసీ ల వాటా మేరకు ఎందుకు ఎమ్మెల్యే,ఎంపీ సీట్లు కేటాయించడం లేదని ప్రశ్నించారు.బీసీ రిజర్వేషన్స్ కోసం వేసిన కాక కాలేకర్ కమిటీ ని నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ ద్రోహం మరువలేనిదన్నారు.బీజేపీ ప్రభుత్వం మండల్ కమిషన్ ను తుంగలో తొక్కి బీసీ లకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు.రాష్ట్ర అధ్యక్షుల సూచన మేరకు మంచిర్యాల,ఆసిఫాబాద్ జిల్లాల కమిటీ లను నియమించారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా ముల్కల రాజేంద్ర ప్రసాద్,నియోజకవర్గ అధ్యక్షులుగా మోత్కూరి నారాయణ గౌడ్,చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జ్ గా చెన్నూరు రాజు,ఆసిఫాబాద్ జిల్లా ఇంచార్జిగా తుకారాం, నియోజకవర్గ అధ్యక్షులుగా కిషన్ రావులను ఏకగ్రీవంగా నియమించారు. నాయకులు కుమ్మరి కృష్ణ ,చైతన్య,బోనగిరి మహేష్ దామర రాజబాబు,సుందిళ్ల అశోక్,ఎస్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది ఉత్సవాలకు మంత్రి శ్రీధర్ బాబుకి ఆహ్వాన పత్రం అందజేశారు



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల కేంద్రం లోని ప్రపంచ ప్రక్యత గాంచిన శ్రీ అధివరహ స్వామి దేవాలయం లో జరుగు ఉగాది ఉత్సవాలకు ఐ టీ మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానిస్తూ ఆలయ ఈఓ కాంత రెడ్డి ఆహ్వాన పత్రం ని ఆదివారం అందజేయడం జరిగింది

# కేటీఆర్ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు..!



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న ముఖ్య కార్యర్తల సభకు ఆదివారం కమాన్ పూర్ మండలంలో నుండి బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, ఏ. ఎం. సీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ వైస్ ఎంపీపీ కొట్టె భూమయ్య, మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, మాజీ ఉప సర్పంచులు పోలుదాసరి సాయికుమార్, జాబు సతీష్,నీలం శ్రీనివాస్, బైరి అంజయ్య గౌడ్, తోట వీరయ్య, తోట రాజ్ కుమార్, సుధాకర్, కుందారపు సత్యనారాయణ, చొప్పరి శ్రీనివాస్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్ఞానమాల



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ఆదివారం రోజున కమాన్పూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే మరియు బిఆర్ అంబేద్కర్ 18వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమాన్పూర్ మండల అధ్యక్షులు అంబటి కనకయ్య నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంఘం నాయకుడు మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు భూపెల్లి మల్లేష్ అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు గుర్రం లక్ష్మి మల్లు హాజరైనారు ఇట్టి కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని 76వ వసంతంలో అడుగుపెడుతున్న తరుణంలో మహాత్మాజ్యోతి రావు పూలే ఆశయాలను కొనసాగించాల నీ జ్యోతిరావు పూలే గొప్ప విద్యావేత్త సాంఘిక సంఘసంస్కర్త అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించినారు ఇదిఅతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగ అని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని ఇట్టి సభలో తెలియపరిచారు ఈ కార్యక్రమంలో గుర్రం లక్ష్మి మల్లుభూపెల్లి మల్లేష్ తాటికొండ శంకర్ పొన్నం నవీన్ తోట రాజ్ కుమార్ కోలేటి రమేష్ మట్ట శంకర్ గన్నేవరపు రాయమల్లు జాబ్ సతీష్ ఆర్ ఎల్ ఈ శంకర్ కొమ్ము సమ్మయ్య తదితరులు తదితరులు హాజరై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు అందరికీ జై భీమ్. అంబటి కనకయ్య

# ఆటో బోల్తా తృటిలో తప్పిన ప్రమాదం



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ :కమాన్ పూర్ మండల కేంద్రంలోని కే. ఎన్ ఫంక్షన్ హాల్ సమీపంలో రహదారి ప్రక్కన గల కెనాల్ లో ఆదివారం ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జూలపల్లి నుండి కమాన్ పూర్ మండల కేంద్రంలోని పిల్లిపల్లె లో గల రేణుక ఎల్లమ్మ గుడికి ఆటో లో డ్రైవర్ తో పాటు వారి కుటుంబ సభ్యులు వెళుతున్నారు. కే. ఎన్ ఫంక్షన్ హాల్ వద్ద రహదారి పై ఆకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో సడెన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి రహదారి ప్రక్కన ఉన్న కాలువలో పడిపోయింది. ఇందులో ప్రయానిస్తున్న స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డట్లు తెలిసింది. ఈ ఆటో జూలపల్లికి చెందిన వారిదిగా తెలిసింది.

# చెడుకు క్షమాపణ చెప్పలేదు మంచి కొరకుమరణాన్ని ఎంచుకున్నడు




## వనపర్తి మాజీ స్వర్ణకార సంఘం అధ్యక్షులు కొండుజు గోపీనాథ్

**అగ్ని ధారా న్యూస్ వనపర్తి జిల్లా :** క్షమాపణ కంటే మరణాన్ని కోరుకున్న మహోన్నత వ్యక్తి మన భగత్ సింగ్ అని వనపర్తి స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షులు కొండోజు గోపీనాథ్ ఆదివారం అగ్నిధార న్యూస్ తో అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నాడు బ్రిటీషర్లు దుర్మార్గ పాలన చేస్తూ భారతీయులను చిత్ర హింసలు పెడుతున్న సందర్భంలో భగత్ సింగ్ వారికి వ్యతిరేకంగా అల్లర్లు చేస్తున్నాడని ఎప్పుడూ అల్లర్లు చేయనని రాతపూర్వకంగా వ్రాసి ఇచ్చి క్షమాపణ కోరాలని కోరితే మరణ శిక్ష నుంచి తప్పిస్తామని ఆయనకు బ్రిటిష్ వారు ఒక అవకాశం ఇచ్చారు ఆ సందర్భంలో వారికి క్షమాపణ చెప్పడం కంటే మరణమే మేలు అనుకుని ఉరికంబమెక్కి తన ప్రాణాలను తునప్రాయంగా వదులుకున్న గొప్ప మహోన్నత వ్యక్తి మన భగవత్ సింగ్ అని అలాంటి వారిని మనం ఎప్పుడూ స్మరించుకోవాలని ఆయన పుట్టిన ఈ దేశంలో మనమందరం పుట్టడం ముఖ్యంగా నేను పుట్టినందుకు గర్విస్తున్నానని ఆయన అన్నారు.

# మంథనిలో ఆవిష్కృతమైన అద్భుతం

- భక్తజన సునామీలో తడిసి ముద్దయిన మంథని
- 5 వేల మంది భక్తులతో భగవద్గీత విజయోత్సవ సభ
- ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**అగ్నిధార న్యూస్ మంథని :** భగవద్గీత విజయోత్సవ శోభాయాత్ర ఆదివారం ఉదయం 8:30 గంటలకు మంథనిలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మంథని పుర వీధుల గుండా శోభాయాత్ర హరే రామ హరే కృష్ణ నామ స్మరణతో మారుమోగింది. తెలంగాణ రాష్ట్రంలోని 70 ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి శోభాయాత్రలు పాల్గొన్నారు. 10 గంటలకు శ్రీ నృసింహ శివ కిరణ్ గార్డెన్ కు చేరుకున్నది.తెలంగాణ రాష్ట్ర సనాతన ధర్మ ప్రచార సమితి, శ్రీసీతారామ సేవాసదన్ ల సంయుక్త ఆధ్వర్యంలో మంథనిలోని శివకిరణ్ గార్డెన్స్ లో భారీ ఎత్తున సామూహిక పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమ ఉత్సవ నిర్వహక కమిటీ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్, తెలంగాణ సనాతన ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంథెన శ్రీనివాస్ సనాతన ధర్మ ప్రచార సమితి రాష్ట్ర కార్యదర్శి మేడగోని రాజమౌళి గౌడ్ కలిసి వొడ్నాల శ్రీనివాస్ బృందం భగవద్గీత విజయోత్సవ సభ నిర్వహణ ఆద్యాంతం ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలకు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...



ప్రపంచంలో ఇప్పటి వరకు ఎక్కడ జరగని విధంగా వేదగ డ్డగా నిలిచిన మంత్రపురిలో 665 రోజులపాటు నిరంతరాయంగా 665 ఇండ్లలో గీతా పారాయణాన్ని నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. గీతా పారాయణంలో పాల్గొన్న భక్తులందరికీ ధన్యవాదాలు తెలియ జేశారు. గీతా పారాయణం లో పాల్గొన్న వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన స్వాములకు, మాతలకు శాలువాలతో సత్కరించారు. విలువలతో కూడిన ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. సనాతన సమాజంలో భగవద్గీతను పూజిద్దామని అన్నారు. ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి అనుమానాలకు భగవంతుడు శ్రీకృష్ణుడు భగవద్గీతలో సమాధానం ఇచ్చాడని అన్నారు. తెలంగాణ ప్రాంతంలోని నలుమూలల నుంచి వచ్చిన భక్తజనులకు సోదర సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. మంథని నెలలో ఇక్కడి గాలిలో ఆధ్యాత్మికత ఉందని అన్నారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు కార్యక్రమానికి కార్యక్రమాన్ని ఆసాంతం తిలకించి తమ రికార్డ్స్ లో నమోదు చేసుకున్నారు. ప్రవచకులుగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, విశిష్ట అతిథిగా సిఎల్ విజయరాజంతో పాటు పలువురు వక్తలు హాజరయ్యారు. భక్తులను ఉద్దేశించి ఎనిమిది మంది స్వామీజీలు భగవద్గీత గొప్పతనం గురించి వివరించారు శివ కిరణ్ గార్డెన్స్ లో భారీ సామూహిక గీత పారాయణ కార్యక్రమంలో భక్తులు పరవశించిపోయారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఏ లోటు లేకుండా మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాము ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్ గుప్తా, వేదగోని రాజమౌళి గౌడ్ , పుప్పాల విక్రమ సింహారావు. కొండమేన అశోక్ కుమార్, బండారి సురేష్, ప్రాయాకర్ రావు కృష్ణమూర్తి, మాడిశెట్టి సత్యనారాయణ, మంథని శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



# సింగరేణి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన



**అగ్ని ధార న్యూస్,( రామగుండం)** సింగరేణి రామగుండం ఏరియా-1 అద్వర్యంలో గోదావరి నది తీర ప్రాంతంలోని సమ్మక్క,సారలమ్మ దేవాలయ సమీపంలో ఈకో పార్కు,రోడ్లు,షెడ్స్,టాయిలెట్స్,సైడ్ వాల్స్,స్నాన ఘట్టాలు,పుష్కర ఘాట్ తదితర మౌలిక వసతులను సింగరేణి ద్వారా సుమారు రూ.3 కోట్ల విలువైన పనులను, రూ.98 లక్షలతో జీడికే ఓసి5 పక్కన ఉన్న కబురస్తాన్ లో పలు మౌలిక సదుపాయాల పనులను రామగుండ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,సింగరేణి రామగుండం ఏరియా 1 జిఎం డి.లలిత్ కుమార్ తో కలిసి శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మక్కాన్ సింగ్ మాట్లాడుతూ సింగరేణి ద్వారా ఇటీవల సుమారు రూ.15 కోట్లతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించామని,రోడ్ల విస్తరణ పనులు,పలు రకాల అభివృద్ధి పనులను కూడా త్వరలో పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేపడుతున్నామని తెలిపారు.ఎన్నడ లేనివిధంగా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి కోసం కార్పొరేషన్,సింగరేణి ద్వారా అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు.వచ్చే ఏడాది సమ్మక్క జాతర దృష్ట్యా గోదావరి నది తీరంలోని సమ్మక్క,సారలమ్మ దేవాలయాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా సింగరేణి సహకారంతో తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళీ స్వామీ,పెద్దెల్లి ప్రకాష్,పాలసాని శ్రీనివాస్,అధికారులు ఎస్ఓటు జిఎం గోపాల్ సింగ్,డిజీఎం పర్సనల్ కిరణ్ బాబు,జితేందర్ సింగ్,వర ప్రసాద్,వసంత కుమార్,కుమారస్వామి,రాజు,దుర్గ ప్రసాద్,వీరారెడ్డి పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం సద్వినియోగం చేసుకోవాలి

## తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తెలంగాణ యువత కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో పథకాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు ప్రారంభించారని, రూ.6 వేల కోట్లతో ప్రారంభించిన ఈ రాజీవ్ యువ వికాసం పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన యువకులకు లక్ష నుండి రూ.4 లక్షల రుణం మంజూరు చేయనుంది కాంగ్రెస్ ప్రభుత్వం.ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన తలకొండపల్లి మండల యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని వచ్చే నెల ఏప్రిల్ 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మొత్తాన్ని బట్టి 60 నుంచి 80 శాతం వరకు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని, ఈ పథకం మండలం లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి అని తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

# మాజీ ఎంపీటీసీ సరిత మృతి బాధాకరం

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సరిత గణేష్ గుప్త మరణం చాలా బాధాకరం అని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు.అనంతరం మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో, పి సి సి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఈనెల 25 న పట్టణంలోని సి కె ఆర్ ఫంక్షన్ హాల్ లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట ువంటి మేఘ జాబ్ మేళా కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకో వాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు అన్నారు .కల్వకుర్తి మండలం లోని తర్నికల్, వేపూరు,బెక్కెర, తుర్కలపల్లి, గుండూరు, సుద్దకల్, రఘుపతిపేట ,ముకురాల, ఎల్లికల్ ,జంగారెడ్డిపల్లి ,తాండ్ర, గ్రామాలలో సుంకిరెడ్డి జాబ్ మేళా పోస్టర్లను స్థానిక ప్రజలతో నిరుద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ,ఈనెల 25న నిర్వహించబోయే జాబ్ మేళాలో 50 కి పైగా కంపెనీలతో పాటు 5000 కు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ,కాబట్టి నియోజకవర్గ నిరుద్యోగులకు, యువతకు సుంకిరెడ్డి జాబ్ మేళా అనేది ఒక వరమని తెలిపారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య ను రూపుమాపే దిశగా సొంత ఖర్చులతో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నటువంటి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అనిల్ గౌడ్, భరత్ రెడ్డి,యువజన కాంగ్రెస్ ఎస్సి సెల్ నాయకుడు పర్వ పాకులా రమేష్ , మాలిక్, శివ,మరియు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కు



## రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల అమనగల్లు మున్సిపాలిటీ పెంట తాండ కు చెందిన జాటావత్ రవి అనారోగ్యానికి గురి కావడం జరిగింది.వారి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆదివారం వారికి గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారం తో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 18,000 రూపాయల సి ఎం ఆర్ ఎఫ్ చెక్కును అందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాములు నాయక్,అమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్,తలకొండ పల్లి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ చంద్ర శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సుమన్ నాయక్, జి ఎస్ ఆర్ యువసేన నాయకులు బన్నే శేఖర్, చలిచీమల సతీష్, ఆమనగల్లు మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి వడ్డేమోని శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సూర్యుడు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ సజీవం






## కూనంనేని సాంబశివరావు

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** సూర్యుడు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ సజీవంగా ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. ఆదివారం దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఐ శతజయంతి సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కొందరు కమ్యూనిస్టు పార్టీల పని అయిపోయిందని అంటున్నారని, ప్రజా సమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీకి అంతం లేదన్నారు. అధికారం కోసంరోజుకోపార్టీ మారే వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని,కమ్యూనిస్టు పార్టీలను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధికారం లేకపోయినా సిపిఐ వందేళ్లుగా సజీవంగా ఉందన్న విషయం వారు తెలుసుకోవాలన్నారు. దేశంలో జనతా పార్టీ, లోక్ దళ్, స్వతంత్ర పార్టీ అధికారంలో కొంతకాలం ఉన్నాయని, అధికారం పోగానే కనుమరుగయ్యాయని విమర్శించారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లుహిందూ మతాన్ని అడ్డం పెట్టుకొని బిజెపి రాజకీయం చేయటం నీచమన్నారు.రాముడు హిందూమతం 500 ఏళ్ల కింద పుట్టిందని, బిజెపి వందేళ్ళ క్రితం పుట్టిందని, బిజెపి లేకముందు ప్రజలు రామున్ని దేవున్నిగా కొలిచారని, హిందూ మతాన్ని ఆచరించారని గుర్తు చేశారు. ప్రజలు గమనించాలన్నారు. కష్టజీవుల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతోందని, సంపన్న వర్గాల వారు ఉండే బిజెపి, కాంగ్రెస్ పార్టీ నేతలకు కమ్యూనిస్టు పార్టీలు అంటే కంటగింపు అన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ తదితర పార్టీలు కమ్యూనిస్టు పార్టీని వాడుకొని మోసం చేశారని విమర్శించారు. మోసపోవటం కమ్యూనిస్టు పార్టీల వంతైందన్నారు. పెద్ద దొంగ కంటే చిన్న దొంగ మేలు అన్నట్టు బిజెపి, బీఆర్ఎస్ లు అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జత కట్టామన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కాంగ్రెస్పై విమర్శల దాడి చేయటం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్తో పొత్తులు శాశ్వతం కాదని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులు సొంతంగాపోటీ చేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలను ఆదరించి అభిమానించేవారు కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ మాట్లాడుతూ.. బిజెపి మతతత్వ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. దేశ సంపదను సంపన్నులకు దోచిపెడుతోందన్నారు. సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షత వహించారు. సభకు ముందు వనపర్తి శ్వేతా నగర్ సిపిఐ ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌక్ రాజీవ్ చౌక్ ఇందిరాపార్క్ వివేకానంద చౌక్ మీదుగా దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ వరకు ఎర్రజెండాలు ఎర్ర చీరలు కండువాలు ధరించి డప్పు వాయిద్యాలతో మహిళలు నృత్యం చేస్తూ, పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్, అబ్రహం, మోషు, రాబర్ట్, గోపాలకృష్ణ, శ్రీహరి,ఎత్తం మహేష్, రవీందర్, కృష్ణవేణి, గీత, కుతుబ్, నరసింహ శెట్టి, లక్ష్మీనారాయణ, దంగు కుర్మయ్య, యూసఫ్, కాకం బాలస్వామి, నరేష్, వంశి, భూమిక, శిరీష, సహదేవుడు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# షహీద్ భగత్ సింగ్ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని సి పి ఎం పార్టీ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ చౌరస్తాలో సర్దార్ షహీద్ భగత్ సింగ్ 94 వ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగిది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, భగత్ సింగ్ చిన్ననాటి నుండే ఆంగ్లేయుల పరిపాలన వారి దోపిడీ విధానం పరదేశ పాలకుల పెత్తనం పై తిరుగుబాటు చేశాడని కేవలం 23 సంవత్సరాల వయసులో దేశం కోసం ప్రాణాలు లెక్కచేయకుండా ఆయన సహచరులైనటువంటి రాజగురు సుఖదేవులతో పాటు దేశ స్వతంత్రం కోసం ఉరికంభం ఎక్కిన సమరసిల పోరాటయోధుడని అన్నారు. 1907లో సర్దార్ కిషన్ సింగ్ విద్యావతి దంపతులకు జన్మించిన భగత్ సింగ్ వారి బంధువులు కుటుంబ సభ్యులు అంతా దేశ విముక్తి పోరాటంలో ఉన్నారని వారి స్ఫూర్తితో 11 ఏళ్ల వయసునుండే స్వతంత్ర పోరాటంలో పాల్గొనటమే కాకుండా అనేక రచనలు చేశాడని, ఆయన రాసిన వ్యాసాలు ప్రజలను కదిలించాయని తెలిపాడు.ఈనాడు ఆయన చరిత్రను కనుమరుగు చేయటం కోసం పుస్తకాలలో పాఠ్యాంశాల నుండి తొలగించడం ప్రభుత్వ కార్యాలయంలో ఫోటోలు తీసివేయడం చూస్తే బాధ కలుగుతుందని ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత అర్థం చేసుకుని దేశం కోసం దేశ ప్రజల కోసం తమ వంతు కృషి చేయాల్సినటువంటి అవసరం ఉన్నదని ఆనాడు స్వాతంత్రం కోసం జాతీయ మతం కులం ప్రాంతం అని తేడా లేకుండా పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు జిల్లా కమిటీ సభ్యులు పులిజాల పరశురాములు, యుటిఎఫ్ మాజీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు రామార్జున్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాసులు సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షులు జిల్లెల్ల మాజీ సర్పంచ్ జంగయ్య, సివిల్ సప్లై గోదాము హమాలీ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు ఎన్. బాలయ్య సిఐటియు నాయకులు రాజు,నరేష్, మల్లేష్ కెవిపిఎస్ నాయకులు రాధా కృష్ణ, జగన్ ,ప్రజానాట్య మండలి కళాకారుడు జగన్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



## ఉప్పల చారి ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామనికి చెందిన జల్లెల్ల మహేష్ అనారోగ్య%శీ% తో మరణించడం జరిగింది. విషయం ఉప్పల వేంకటేష్ ముఖ్య అనుచరుడు చౌటి విజయ్ కుమార్ ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 3000వేల రూపాయలను గ్రామ బిఆర్ఎస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ గ్రామఅధ్యక్షులుశ్రీశైలం,జంగయ్య,రమేష్ పాండు, జంగయ్య, అంజయ్య శ్రీశైలం ,చంద్రయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



## రైతన్నలకు అండగా ప్రభుత్వం ఉంటుంది.. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు...



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** శుక్రవారం కురిసిన అకాల వర్షానికి పెద్దపల్లి నియోజకవర్గం ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో,జూలపల్లి మండలంలో కొనరావుపేట, జూలపల్లి గ్రామాలల్లో పెద్దపల్లి మండలంలోని చీకురాయి, బొజన్నపేట, హనుమంతునిపేట, గ్రామాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు పర్యటించారు. ఆకాల వర్ష%శీ% వల్ల నష్టపోయిన పంటలను వ్యవసాయ హార్టికల్చర్ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అకాల వర్షం కారణంగా పెద్దపల్లి నియోజకవర్గంలోని జూలపల్లి మండలంలోని కోనరావుపేట, జూలపల్లి గ్రామాలల్లో, ఎలిగేడు మండలంలోని దూళికట్ట గ్రామంలో పెద్దపల్లి మండలంలోని బోజన్నపేట, చీకురాయి హనుమంతునిపేట గ్రామాల రైతుల వరి, మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని, నష్టపోయిన రైతుల పంట పొలాలతో పాటు మొక్కజొన్నను అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో పాటు, వ్యవసాయ శాఖ కమిషనర్ రామకృష్ణా రావు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నవారు రైతులు ఎప్పుడు నష్టపోయిన పట్టించుకున్న పాపాన పోలేదని ప్రస్తుతం తాము రైతుల పక్షాన నిలబడి వారిని నష్టపోకుండా కృషి చేస్తానన్నారు. అలాగే రైతులందరూ చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకున్నామని ప్రతి రైతు గుంట భూమి ఎండిపోకుండా నీరు అందించేందుకు చర్యలు చేపట్టమన్నారు. రైతులు తూములు కాలువ గట్లను ధ్వంసం చేసి నీరును వృధా చేయవద్దని అలా చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ, ట్రాక్టర్ పై కేసు నామోదు



## సబ్ ఇన్స్పెక్టర్ మాధవరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండల పరిధిలో తెల్లవారు జామున డిండి చింతపల్లి నుండి ఒక లారీ అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా జేపీ నగర్ సమీప%శీ% దగ్గర మరియు రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పూర్తి సమాచారం తెలుసుకొని కల్వకుర్తి లో ఇసుక లారీ ట్రాక్టరు లను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కల్వకుర్తి ఎస్ ఐ మాధవ రెడ్డి తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



## ఉప్పల చారి ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామనికి చెందిన జల్లెల్ల మహేష్ అనారోగ్య తో మరణించడం జరిగింది. విషయం ఉప్పల వేంకటేష్ ముఖ్య అనుచరుడు చౌటి విజయ్ కుమార్ ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 3000వేల రూపాయలను గ్రామ బిఆర్ఎస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ గ్రామఅధ్యక్షులుశ్రీశైలం,జంగయ్య,రమేష్ పాండు, జంగయ్య, అంజయ్య శ్రీశైలం ,చంద్రయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం యువతి,యువకులు దరఖాస్తు చేసుకోండి

## కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ నిజామొద్దీన్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తెలంగాణ యువత కోసం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, రూ.6 వేల కోట్లతో ప్రారంభించిన ఈ రాజీవ్ యువ వికాసం పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన యువకులకు లక్ష నుండి రూ.4 లక్షల రుణం మంజూరు చేయనుంది ప్రభుత్వం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.వచ్చే నెల ఏప్రిల్ 5 వరకు ఆన్లైన్లో దరఖాస్తులుచేసుకోవాలని,మొత్తాన్ని బట్టి 60 నుంచి 80 శాతం వరకు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని, ఈ పథకం ద్వారా తెలంగాణవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 5 లక్షల మంది నిరుద్యోగులు లబ్ధిపొందనున్నారని, నాగర్ కర్నూల్ జిల్లా యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ నిజామొద్దీన్ తెలిపారు.

# ఘనంగా జన్మదిన వేడుకలు



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి:**తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ జన్మదిన వేడుకలు పెద్దపల్లిలో స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో టీపీసీసీ ఎస్సీసెల్ కన్వీనర్ పెర్క సంతోష్ ఆధ్వర్యంలో, ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కేకే కటింగ్ చేసిపండ్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా ఉపాధ్యక్షులు మేకల సతీష్,బీసీ సంఘం మండల అధ్యక్షులు కలవేన రవి,కలవేన ఓదెలు,సది తదితరులు పాల్గొన్నారు.



# మెరూన్ డ్రెస్సులో మెరిసిపోతున్న జాన్వీ కపూర్

## శివబాలాజీ, మధుమిత క్రేజీ కాంబో..

### గోదారికే సోగ్గాన్నే సాంగ్

టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న సెలబ్రిటీ కపుల్స్‌లో ముందు వరుసలో ఉంటారు శివ బాలాజీ-మధుమిత. ఈ రియల్ లైఫ్ కపుల్ కాంబో క్రేజీ పాటతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. గోదారికే సోగ్గాన్నే అనే జానపద గీతంలో నటించడం విశేషం. సోషల్ మీడియాలోని ఇన్‌ఫ్లూయెన్సర్ టాలెంట్‌ను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ మ్యూజికల్ ఆల్బమ్‌ను మొదలుపెట్టారని చెప్పింది మధుమిత. గోదారి యాసలో సాగే ఈ మ్యూజికల్ ఆల్బమ్ 8 నిమిషాల కంటెంట్‌తో ఉంటుంది. మేమిద్దరం సింగిల్ టేక్‌లో చేశామని శివబాలాజీ అన్నాడు. ఈ ఆల్బమ్‌ను మంచు విష్ణు హెూంబ్యానర్ అవా ఎంటర్‌టైన్‌మెంట్‌పై రూపొందించారు. గోదారికే సోగ్గాన్నే పాటపై మీరూ ఓ లుక్కేయండి.






## నో అప్డేట్స్.. అభిమానులకు నిరాశ తప్పదేమో!

ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్ పాన్ ఇండియా హీరోలుగా ఫుల్ క్రేజ్ సంపాదించారు. చరణ్ ప్రస్తుతం ఓ మూవీ చేస్తున్నాడు. మరో మూవీ లైనులో ఉంది. బన్నీ కూడా రెండు సినిమాల కోసం సిద్ధమవుతున్నాడు. సరిగ్గా ఇలాంటి టైంలో ఓ బ్యాడ్ న్యూస్ అభిమానుల మధ్య చర్చకు కారణమవుతోంది. హీరోలన్నాక సినిమాలు చేస్తుంటారు. మంచి రోజులు చూసుకుని అప్డేట్స్ ఇస్తుంటారు. ఇక పుట్టినరోజున గ్లింప్స్, పోస్టర్స్ లాంటివి రిలీజ్ చేస్తుంటారు. త్వరలో చరణ్ (మార్చి 27), బన్నీ (ఏప్రిల్ 8) బర్త్ డేలు రాబోతున్నాయి. దీంతో కొత్త మూవీ అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. కానీ ఈసారి అలాంటివేం ఉండవని తెలుస్తోంది. చరణ్-బుచ్చిబాబు సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. కొన్నిరోజుల క్రితం ఈయన గుండెల్లో నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేరారు. డిశ్చార్జ్ కూడా అయిపోయి ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే గ్లింప్స్ విజువల్స్ రెడీ అయిపోయినా సరే మ్యూజిక్ బాకీ ఉండటంతో చరణ్ పుట్టినరోజు దీన్ని రిలీజ్ చేయడం కష్టమేనని మాట్లాడుకుంటున్నారు. మరోవైపు అల్లు అర్జున్ కొత్త మూవీస్ కి సంబంధించి పుట్టినరోజున అనౌన్స్ మెంట్స్ ఉండొచ్చని అనుకున్నారు. కానీ బన్నీ నానమ్మ ప్రస్తుతం వెంటిలేటర్ పై ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త సినిమాల ప్రకటన సరికాదని, వాయిదా వేసుకున్నట్లు సమాచారం. ఈ రూమర్స్ బట్టి చూస్తే త్వరలో మంచి రోజు చూసుకుని చరణ్, బన్నీ మూవీస్ అప్డేట్స్ రిలీజ్ చేస్తారనిపిస్తుంది.

## థియేటర్స్‌లో ఈ సినిమాలు అట్టర్ ఫ్లాప్.. ఓటీటీలో మాత్రం రచ్చో రచ్చః

ఈ మధ్య కాలంలో ఎత పెద్ద హిట్ అయిన సినిమా అయిన రిలీజ్ అయిన కొద్ది రోజుల వ్యవధిలోనే థియేటర్స్‌లోకి వచ్చేస్తుంది. సినిమా హిట్ అయితే రెండు నెలల్లో ఓటీటీలో సందడి చేస్తుంది. అదే యావరేజ్ అయితే నెల కాకముందే ఓటీటీలో స్ట్రీమ్ అవుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే కొన్ని సినిమాలు థియేటర్స్‌లో పెద్దగా హిట్ కాకపోయిన ఓటీటీలో మాత్రం సందడి చేశాయి. థియేటర్లలో బొక్క బోర్లా పడ్డ పడి డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో ఆ రెండు సినిమాలు ట్రెండింగ్ లో దూసుకుపోతున్నాయి. ఈ ఏడాది ఒకే రోజు థియేటర్లలో విడుదలైన సినిమాలు థియేటర్స్‌లో పెద్దగా అలరించలేకపోయాయి. కాని ఓటీటీ ట్రెండింగ్ లో దూసుకుపోతున్నాయి. అవి మరేవో కాదు ఎమర్జెన్సీ.. ఆజాద్. బాలీవుడ్ కాంట్రవర్సీ క్వీన్ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వచ్చిన హిస్టారికల్ పొలిటికల్ డ్రామా ఎమర్జెన్సీ చిత్రం ఈ ఏడాది జనవరి 17న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో కంగనా ఇందిరా గాంధీ పాత్రలో కనిపించి అలరించింది. అయితే దాదాపు రూ.60 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.22 కోట్ల కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. కాకపోతే నెట్‌ఫ్లిక్స్ లో ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న ఈ చిత్రం టాప్ 3 ట్రెండింగ్ ప్లేస్ లో ఉంది. అంతేకాదు ఈ చిత్రానికి ఐఎమ్డీబీ 5.2 రేటింగ్ ఇచ్చింది.

